సమగ్ర తెలుగు దినపత్రిక

Website: www.adugunews.com

అడుగు

The Step Towords The Truth..

హైదరాబాద్ గురువారం, 03 ఏప్రిల్ 2025 సంపుటి: 01 సంచిక: 106 పేజీలు: 4 వెల: రూ.6:50

Published from Telangana, Andhra Pradesh చీఫ్ ఎడిటర్: డాక్టర్ మార్గం లక్ష్మీనారాయణ Mail: adugudaily@gmail.com

భారత్ సహా పలు దేశాలపై ట్రంప్ టారిఫ్‌ల బాదుడు!

అమల్లోకి ట్రంప్ ప్రతీకార సుంకాలు

న్యూఢిల్లీ,ఏప్రిల్ 2(అడుగు న్యూస్): భారత్ సహా కీలక వాణిజ్య భాగస్వామ్య దేశాలపై అమెరికా విధించే ప్రతీకార సుంకాలు బుధవారం నుంచి అమలు కానున్నాయి. ఇందులో ఎలాంటి మినహాయింపుల్లేవని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇప్పటికే స్పష్టం చేశారు. టారిఫ్‌ల ప్రారంభం నేపథ్యంలో అమెరికాకు విమోచన దినంగా ట్రంప్ అభివర్ణించారు.

మిగతా 3లో..

తెలంగాణలో ఎల్ఆర్ఎస్ గడువు పెంపు

ఏప్రిల్ 30 వరకు పెంచుతూ ఆదేశాలు

హైదరాబాద్,ఏప్రిల్2(అడుగు న్యూస్): తెలంగాణ ప్రజలకు రేవంత్ రెడ్డి సర్కార్ గుడ్ న్యూస్ చెప్పింది. ఎల్ఆర్ఎస్ ఫీజు చెల్లింపు గడువును ఈ మాసాంతానికి అంటే.. ఏప్రిల్ 30వ తేదీ వరకు పెంచుతూ ప్రభుత్వం బుధవారం ఆదేశించింది. ఈ గడువు మార్చి 31వ తేదీతో పూర్తయింది. కానీ ఈ గడువును పెంచుతూ పురపాలక శాఖ ఆదేశాలు జారీ చేసింది. ఇక ఏప్రిల్ 30వ తేదీ వరకు ఎల్ఆర్ఎస్‌కు

మిగతా 3లో..

అనంత శోకంతో... రేణుక అంతిమయాత్ర!

బరువెక్కిన గుండెతో... ఎరుపెక్కిన కడవెండి!

ఉద్యమాల పురిటిగడ్డపై ఆడబిడ్డకు అంతిమ వీడ్కోలు!

విప్లవ పాటలతో నివాళులర్పించిన కళాకారులు!

- కామ్రేడ్ రేణుకకు రెడ్ సెల్యూట్ చేసిన ప్రజా సంఘాలు!
- జగద్గిదంతాలు దద్దరిల్లేలా జోహార్లు అర్పించిన జనాలు
- దశ దిశలా వేలాదిగా తరలివచ్చిన అభిమానులు!
- ఆఖరు సంస్కారాలలో కదంతొక్కిన మహిళలు!

రేణుక తల్లిదండ్రులు సోమయ్య, జయమ్మ

కడవెండి (జనగామ జిల్లా), ఏప్రిల్ 2(అడుగు ప్రత్యేక ప్రతినిధి):

ఉద్యమాల పురిటి గడ్డలో పురుడు పోసుకున్న గుమ్మడవెల్లి రేణుక అలియాస్ భాను అలియాస్ దమయంతి, అలియాస్ చైతే అలియాస్ మిడ్కో హతమైన ఘటన విప్లవోద్యమకారులనే కాదు, విప్లవాభిమానులను, కడవెండి ప్రజలను హతాషులను చేసింది. ఆమెను కన్న తల్లిదండ్రులు గుమ్మడవెల్లి సోమయ్య, జయమ్మలే కాదు వారి ఊరు కడవెండి సైతం మూగబోయింది. శోకతప్త హృదయాలు బరువెక్కాయి. జనగామ జిల్లా దేవరుప్పుల మండలం కడవెండి గ్రామానికి చెందిన రిటైర్డ్ టీచర్ గుమ్మడివెల్లి సోమయ్య, జయమ్మల రెండో సంతానంగా పుట్టిన రేణుక విప్లవోద్యమ అజ్ఞాతవాసంలో ఉంటూ, మార్చి 31న పవిత్ర రంజాన్ రోజున చత్తీస్ ఘడ్ రాష్ట్రం దక్షిణ బస్తర్ లోని దంతెవాడ %-% బీజాపూర్

- మిగతా 3లో

"నా గొంతుక మూయిస్తే వేయి గొంతులై వస్తా! విప్లవమా, వర్ధిల్లని వీధి వీధి నినదిస్తా! భగత్సింగునురిదీస్తే తిరుగుబాటు ఆగిందా? సర్దార్ హుష్మిని నరికితే పాట మూగబోయిందా? ఆగదు మన రగల్జెండ పోరాటం..." అన్న పాటను అక్షరాలా నిజం చేస్తున్నట్లు... బరువెక్కిన గుండెతో... ఎరుపెక్కిన కడవెండి, అనంత శోకంతో... రేణుక అంతిమయాత్రను నిర్వహించింది. ఒక షేక్ బందగీని, ఒక దొడ్డి కొమురయ్యని, నల్ల నరసింహులుని, ఎర్రంరెడ్డి సంతోష్ రెడ్డిని, పైళ్ళ వెంకటరమణ, పెద్ది యాదగిరిలను తలచుకుంటూ, మీ ప్రాణ త్యాగం వృథా పోదని నినదిస్తూ, ప్రజా సంఘాలు కామ్రేడ్ రేణుకకు రెడ్ సెల్యూట్ చేశాయి. పోరుబాటలో నేలకొరిగిన రేణుక త్యాగాలను స్మరిస్తూ కళాకారులు విప్లవ పాటలతో నివాళులర్పించారు. పేగు బంధం కాదు. ఏ బంధమూ లేదు. కులం కాదు. ఇలం కాదు పలం కాదు. ఇలాతలాన్ని కలిపేస్తూ తరలి వచ్చిన జనాలు, జగద్గిదంతాలు దద్దరిల్లేలా జోహార్లు అర్పించారు. కుటుంబ సభ్యులు కాలం చేస్తేనే దిక్కూ దెశా లేని ఈ కాలంలో... దశ దిశలా వేలాదిగా అభిమానులు తరలివచ్చారు. సాటి మహిళ అన్న సానుభూతితో కాదు. సెల్యూట్ చేసి తీరాల్సిన వ్యక్తిత్వమన్న, త్యాగాల పోరాట తత్వమన్న తపనతో రేణుక ఆఖరు సంస్కారాలలో మహిళలు పదం పాడారు. కదంతొక్కారు. ఒక్క గొంతుక మూయిస్తే వేయి గొంతుకలై వచ్చినట్లుగానే, వేలాదిగా ప్రజలు వేల వేల గొంతులెత్తి కడవెండిలో జరిగిన రేణుక అంతిమయాత్రలో పాల్గొని విప్లవోద్యమాలపై తమ సహానుభూతిని చాటుకున్నారు.

గన్‌డౌన్‌కు మేం సిద్ధం!?

శాంతి చర్చలపై మావోయిస్టుల సంచలన లేఖ!

హైదరాబాద్, ఏప్రిల్ 2(అడుగు ప్రత్యేక ప్రతినిధి): గత కొద్దిరోజులుగా కేంద్ర బలగాలు మావోయిస్టులపై ఉక్కుపాదం మోపుతున్నాయి. కూబింగ్ పేరుతో మొత్తం ఐదు రాష్ట్రాల్లోని అభయారణ్యాల్లో జల్లెడ పడుతూ వారిపై విరుచుకుపడుతోన్న విషయం తెలిసిందే. ఇప్పటికే పదుల సంఖ్యలో ఎన్కౌంటర్లు జరగ్గా.. వందల మంది మావోయిస్టులు అశువులు బాశారు. ఈ క్రమంలోనే కాల్పుల విరమణకు తాము సిద్ధమంటూ శాంతి చర్చల పై మావోయిస్టులు కేంద్ర కమిటీ అధికార

- మిగతా 3లో

హిందూయిజం పేరుతో బీజేపీ రాజ్యహింస

ప్రశ్నించే గొంతులపై పాశవిక దాడులు

ప్రతిపక్షాలు స్పందించాలి

రేణుక అంతిమయాత్రలో ప్రజా సంఘాలు డిమాండ్

బిజెపి ప్రభుత్వం రాజ్యహింసను కొనసాగిస్తున్నది. హిందూయిజం పేరుతో మానవత్వ ద్రుక్పథంలేని, అమానవీయ మతోన్మాదాన్ని రెచ్చగొడుతున్నది. మనుషుల మధ్య మంటలు పెడుతున్నది. దశాబ్దాలుగా కొనసాగుతున్న ప్రజా ఉద్యమాలపై ఎలాంటి వాస్తవిక అధ్యయనం చేయకుండా నిరంకుశంగా, పాశవికంగా అణచివేతకు, ఉద్యమ కారుల అంతానికి పంతంతో పని చేస్తున్నది. చత్తీస్ ఘడ్ దండకారణ్యంలోని సహజ, ఖనిజ వనరుల దోపిడీ కోసం ఆదివాసీ బిడ్డలను అతి కిరాతకంగా బూటకపు ఎన్ కౌంటర్లలో

- మిగతా 3లో

ఇసుక.. ఇష్యూ స్టేట్ పాలసీ!

-వర్ధన్నపేట ఎమ్మెల్యే కెఆర్ నాగరాజు వెల్లడి

వర్ధన్నపేట, ఏప్రిల్ 2 (అడుగు న్యూస్): 'అడుగు' లో వచ్చిన వార్తా కథనానికి వర్ధన్నపేట ఎమ్మెల్యే కె.ఆర్.నాగరాజు స్పందించారు. "కిస్సా ఇసుక కా? ఓ వ్యక్తి ఆత్మహత్యాయత్నం. అతి ప్రయత్నం మీద కాపాడిన పోలీసు యంత్రాంగం. ప్రభుత్వ ఇసుక పాలసీ తో ఇ'బ్బందులు'. 'స్థానిక దందా'ను కొనసాగించాలని విన్నపాలు. వినిపించుకోలేదని ఎమ్మెల్యేపై డౌన్ డౌన్ నినాదాలు. అప్పటికప్పుడు ధర్నాకు దిగిన ఇసుక దందాదారులు. తమ భర్తలను కాపాడాలంటూ మహిళల వేడుకోలు" అంటూ 'అడుగు'లో ఏప్రిల్ 2వ తేదీన ప్రత్యేక కథనం వచ్చిన సంగతి తెలిసిందే. ఈ కథనంపై ఎమ్మెల్యే నాగరాజు వర్ధన్నపేటలో బుధవారం ప్రెస్ మీట్ పెట్టి మాట్లాడారు.

అడుగు EFFECT

ఇసుక ఇష్యూ స్థానికం కాదని, తమ పరిధిలో లేదని, రాష్ట్ర స్థాయిలో స్టేట్ పాలసీగా ఉందని తేల్చి చెప్పారు. ఆవిషయమై ఏ నిర్ణయమైనా సరే, సీఎం తీసుకోవాల్సిందేనని చెప్పారు. తాను తన నియోజకవర్గంలో ఏ నిర్ణయం తీసుకున్నా, అది ప్రభుత్వానికి వ్యతిరేకంగా మారుతందన్నారు. అలా చేయడం సరికాదన్నారు. స్థానికంగా ఉన్న సమస్యలను తాను ఎప్పటికప్పుడు తమ నియోజకవర్గ ప్రజలతో చర్చిస్తున్నానని అన్నారు. అలాగే ఆయా సమస్యలను సీఎం, మంత్రుల ద్రుష్టికి తీసుకెళుతున్నానని, అలాగే వాటి పరిష్కారానికి తీవ్రంగా ప్రయత్నిస్తున్నామని చెప్పారు. స్థానిక అవసరాల రీత్యా తగు నిర్ణయం తీసుకునేంత వరకు ఎవరైనా సరే, వేచి చూడాలన్నారు. ఇసుక అందరికీ అవసరమేనని, స్థానికావసరాలకు సరిపడే నిర్ణయాన్ని సీఎం తీసుకుంటారన్న ఆశాభావాన్ని ఆయన వ్యక్తం చేశారు. అప్పటి వరకు స్థానిక ప్రజలు ఓపిక పట్టాలని ఆయన కోరారు.

రజతోత్సవాలపై నియోజకవర్గాల వారీగా సమావేశాలు

మెదక్ జిల్లా ముఖ్యనేతలతో కేసీఆర్ భేటీ

గజ్వెల్,ఏప్రిల్2(అడుగు న్యూస్): భారత రాష్ట్ర సమితి పార్టీ రజతోత్సవ మహాసభ సందర్భంగా నియోజక వర్గాల వారీగా సన్నాహక సమావేశాలు నిర్వహించాలని నేతలకు పార్టీ అధినేత కెసిఆర్ సూచించారు. సభ ఏర్పాట్లపై ఆ పార్టీ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖరరావు ఎర్రవెల్లిలోని నివాసంలో

- మిగతా 2లో

అభ్యంతరమెందుకు?

మా రాష్ట్రంలో రిజర్వేషన్లు పెంచితే మోదీకి వచ్చిన కష్టమేంటి?

- తెలంగాణలో బీసీ బిల్లును ఆమోదించండి
- గుజరాత్‌లో అమలుచేయాలని మేం కోరడంలేదు
- మా డిమాండ్‌కు మీరు మోకాలడ్డు వేయొద్దు
- రాహుల్ ఆదేశాల మేరకు బీసీ కులగణన
- జంతర్‌మంతర్ బీసీ ధర్నాలో సీఎం రేవంత్ రెడ్డి

"బీసీ కులగణన ఆలోచనకు స్ఫూర్తి రాహుల్ గాంధీ. భారత్ జోడో యాత్రలో బహుజనులందరూ తమ లెక్కలు తేల్చాలని ఆయనను కోరారు. జనగణనతో పాటు కులగణన చేయాలని కాంగ్రెస్ పార్టీ విధానపరమైన నిర్ణయం తీసుకుంది. ఒక్కసారి నిర్ణయం తీసుకుంటే కాంగ్రెస్ వెనక్కి తగ్గదు. ఏ రాష్ట్రంలో అధికారంలోకి వస్తే ఆ రాష్ట్రంలో కులగణన చేస్తామని రాహుల్ గాంధీ మాట ఇచ్చారు. అందులో భాగంగానే తెలంగాణలో కులగణన చేపట్టాం."

న్యూఢిల్లీ,ఏప్రిల్ 2(అడుగు న్యూస్): బీసీ బిల్లు ఆలోచనకు స్ఫూర్తి రాహుల్ గాంధీ అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. జనగణనలో కులగణన చేయాలని రాహుల్ గాంధీ డిమాండ్ చేశారన్నారు. అందుకే బీజేపీ కుట్రపూరితంగా జనగణన వాయిదా వేస్తోందని మండిపడ్డారు. భారత్ జోడో యాత్రలో రాహుల్ గాంధీని బీసీల లెక్కలు అడిగారని తెలిపారు. ఎక్కడ అధికారంలోకి వచ్చినా కుల గణన చేస్తామని పాదయాత్రలో రాహుల్ గాంధీ స్పష్టంగా చెప్పారన్నారు. పార్టీ విధానపరమైన నిర్ణయం తీసుకుందని తెలిపారు. రాహుల్ గాంధీ ఇచ్చిన హామీని నిలబెట్టాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. అందుకే కుటగణన చేపట్టామని అన్నారు. బుధవారం నాడు ఢిల్లీలోని జంతర్ మంతర్ బీసీ పోరు గర్జనలో సీఎం పాల్గొని ప్రసంగించారు. రాహుల్ గాంధీ ఇచ్చిన మాట తెలంగాణలో నిలబెట్టానని తెలిపారు. తండ్రి కొడుకు ఉద్యోగం ఊడకొట్టండి మీకు ఉద్యోగాలు వస్తాయని ఎన్నికల సమయంలో పాదయాత్రలో చెప్పానన్నారు. అన్న ప్రకారమే ఏడాదిలో 59 వేల ఉద్యోగాలు ఇచ్చామని తెలిపారు. బీసీలది ధర్మబద్ధ కోరిక అది నెరవేర్చాల్సిన బాధ్యత తనపై ఉందన్నారు. బీజేపీ అందుకు సిద్ధంగా లేదని విమర్శించారు. మండల్ కమిషన్‌కు వ్యతిరేకంగా బీజేపీ యాత్ర చేసిందన్నారు. ఇందిరాగాంధీ దళిత్ కాదని.. కానీ ఆమె

- మిగతా 2లో

లోక్‌సభ ముందుకు వక్ఫ్ సవరణ బిల్లు

- సభలో వాడీవేడీగా చర్చ..
- చట్ట సవరణ ఎవరికీ వ్యతిరేకం కాదు
- లేకుంటే పార్లమెంట్ స్థలం కూడావక్ఫ్‌దే అంటారు
- కేంద్రమంత్రి కిరణ్ రిజిజు సంచలన వ్యాఖ్యలు

న్యూఢిల్లీ,ఏప్రిల్2(అడుగు న్యూస్): వక్ఫ్ చట్టంపై వాడీవేడీ చర్చ జరిగింది. లోక్‌సభలో బిల్లుపై పలువురు ఎంపిలు తమ అభిప్రాయాలను తెలియచేశారు. వక్ఫ్ చట్ట సవరణ జరగకుంటే...పార్లమెంట్ భవనం కూడా దాని కిందకు వచ్చేదని పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు అన్నారు. కేంద్ర ప్రభుత్వం బుధవారం లోక్‌సభ ముందుకు వక్ఫ్ సవరణ బిల్లును తీసుకు వచ్చింది. ఈ బిల్లును సభలో కేంద్ర మైనార్టీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు ప్రవేశపెట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రతిపక్షం కాంగ్రెస్ పార్టీపై విమర్శలు గుప్పించారు. యూపీఏ హయాంలో ఈ వక్ఫ్ చట్టంలో కీలక మార్పులు చోటు చేసుకున్నాయని ఆయన ఆరోపించారు. 1970 నుండి ఢిల్లీలో జరుగుతున్న ఒక

- మిగతా 2లో

ఫిరాయింపు ఎమ్మెల్యేలపై స్పీకర్ చర్యలేవి?

- చర్యలు తీసుకోకపోయినా చూస్తూ కూర్చోవాలా?
- కోర్టులు ఎలాంటి ఆదేశాలు జారీ చేయకూడదా?
- లాయర్ ముకుల్ రోహత్గీని ప్రశ్నించిన సుప్రీం
- స్పీకర్ విశేషాధికారాలను కోర్టులు హరించలేవు
- సభాపతి నిర్ణయం తీసుకున్నాకే జ్యుడిషియల్ సమీక్ష
- అసెంబ్లీ స్పీకర్ కాలపరిమితితో నిర్ణయం తీసుకోవాలి
- సరైన సమయంలో నిర్ణయం తీసుకోవాలని సూచించలేం
- సుప్రీంలో ముకుల్ రోహిత్గి కీలక వాదనలు
- పార్టీ మారిన ఎమ్మెల్యేల వ్యవహారంలో సుప్రీంలో వాదనలు

న్యూఢిల్లీ,ఏప్రిల్ 2(అడుగు న్యూస్): తెలంగాణ ఎమ్మెల్యేల పార్టీ ఫిరాయింపుల కేసు సుప్రీంకోర్టులో మరోసారి విచారణకు వచ్చింది. ఇదివరకే బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు పాడి కౌశిక్ రెడ్డి, కేటీఆర్,

- మిగతా 2లో

ఉద్రిక్తంగా హెచ్‌సీయూ ప్రాంతాలు

- విద్యార్థులను చితకబాదిన పోలీసులు
- ప్రొఫెసర్లపై లాఠీచార్జీ బాధాకరం
- రాష్ట్రంలో ఎమర్జెన్సీని తలపిస్తున్న రేవంత్ పాలన
- మాజీ మంత్రి హరీశ్‌రావు

హైదరాబాద్, ఏప్రిల్2(అడుగు న్యూస్): హెచ్‌సీయూ భూములను కాపాడుకోవడం కోసం రేవంత్ రెడ్డి సర్కార్‌పై హెచ్‌సీయూ విద్యార్థులు పోరుబాట కొనసాగిస్తూనే ఉన్నారు. జీవ వైవిధ్యాన్ని కాపాడాలంటూ

- మిగతా 2లో

సెంట్రల్ వర్సిటీ భూములపై విచారణ

నేటికి వాయిదా వేసిన హైకోర్టు

ఎక్కడా చెట్లను నరకవద్దని ఆదేశాలు

హైదరాబాద్,ఏప్రిల్2 (అడుగు న్యూస్): హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూములపై విచారణను

- మిగతా 2లో

సంపాదకీయం

మార్గం - అడుగు

తీరు మారాలి! మారి తీరాలి!!

ఏపీ, తెలంగాణ రాష్ట్రాల్లో కాంగ్రెస్ ప్రయాణం అగమ్యగోచరంగా ఉంది. ముఖ్యంగా ఎపిలో కాంగ్రెస్ చుక్కాని లేని నావలా తయారైంది. అక్కడ ఎవరు వచ్చినా ఆ పార్టీ బతికి బట్టకట్టడం కష్టంగా కనిపిస్తున్నది. గత ఎన్నికలకు ముందు షర్మిల పగ్గాలు చేపట్టినా పెద్దగా లాభం లేకుండా పోయింది. చివరకు ఆమె కూడా గెలవలేదు. వైఎస్ వారసత్వాన్ని అందిపుచ్చుకోవడంలో జగన్ సఫలమైనా..పాలనలో విఫలం అయ్యారు. స్వార్థపూరిత రాజకీయాలు జగన్ పతనాన్ని శాసించాయి. ఇప్పుడు షర్మిల పోరాటం వల్ల జగన్‌కు నష్టం జరగిందే తప్ప కాంగ్రెస్‌కు లాభం చేకూరలేదు. తెలంగాణలో బిజెపికి దక్కాల్సిన అధికారం అనూహ్యంగా కాంగ్రెస్‌కు దక్కింది. రేవంత్ రెడ్డి సిఎం అయ్యాక చేస్తున్న కార్యక్రమాలు కొంతమేర సత్ఫలితాలిస్తున్నా, ఇంకా పూర్తి సమర్థ నేతగా రుజువు చేసుకోవాల్సి ఉంది. బహునాయకత్వం, ప్రతి దానికీ హైకామండ్ ముందు మోకరిల్లాల్సి రావడం వంటి కారణాల వల్ల కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల్లో పలచనవుతోంది. మంత్రులతంతా ఎవరికివారు యమునా తీరే అన్నట్లుగా ఉంటున్నారు. తమ శాఖల పరిధిలోని కార్యక్రమాలను పటిష్టంగా అమలు చేయలేక పోతున్నారు. దేవాయదాయ, అటవీ శాఖ మంత్రి కొండా సురేఖకు ఈ రెండు శాఖల్లో ఏం జరుగుతుందో తెలుస్తున్నట్లు లేదు. అడవుల్లో మొక్కల పెంపకం అటకెక్కింది. కోతులు గ్రామాలను పట్టిపీడిస్తున్నా పట్టించుకోవడం లేదు. దేవాలయ భూముల చెరను విడిపించలేదు. కోమటిరెడ్డి వెంకటరెడ్డి మాటలకే పరిమితం అయ్యారు. ఎక్కడా రోడ్ల అభివృద్ధి జాడ లేదు. హైదరాబాద్ అంతర్గత రోడ్లు ఏడాది దాటినా అభివృద్ధికి నోచలేదు. గ్రామాల్లో నిధులు విడుదల కాకపోవడంతో పనులు పడకేశాయి. ఇలా ఒక్కోమంత్రి తీరు ఒక్కోలా ఉంది.

కాంగ్రెస్ అధికారంలో ఉంటే ప్రజలను పట్టించుకోదు. ప్రతిపక్షంలో ఉంటే విపక్షంగా గట్టి పాత్ర నిర్వహించదు. అధికారం కోసం వెంపర్లాడడం తప్ప అణగిమణిగి ఉండాలన్న ఆకాంక్ష కానరాదు. పార్టీని బలోపేతం చేయడం కోసం ఎవరూ పాటుపడరు. ఎవరైనా ముందుకు వస్తే ముందరి కాళ్ళకు బంధం వేస్తారు. అధికారం వస్తే పదవుల కోసం పాకులాడుతారు. అధికారం లేకుంటే కీచులాటతో పార్టీని భ్రష్టు పట్టిస్తుంటారు. మొత్తంగా కాంగ్రెస్‌లో ఒకరిపై ఒకరికి విశ్వాసం ఉండదు. నాయకత్వాన్ని సహించే లక్షణం, కార్యకర్తలను పట్టించుకునే దక్షణం కానరాదు. అనే నానుడి ఇంకా కొనసాగుతూనే ఉంది. తాజాగా తెలంగాణ కాంగ్రెస్‌లో ఇదే ధోరణి కనిపిస్తోంది. బీఆర్ఎస్, బీజేపీల విమర్శలను సమర్థంగా తిప్పికొట్టలేక పోతున్నారు. హైదరాబాద్ భూముల విషయాన్ని డిఫెండ్ చేసుకోలేకపోతున్నారు. నిజానికి భూమిని కోర్టులో పోరాడి దక్కించుకుంటే, దానిని రక్షించాలి తప్ప ఆమ్మకూడదు. కాంగ్రెస్ నేతలు ఎవరికి వారే అధికార కుంపటిని ఏర్పాటు చేసుకుంటున్నారు. ఇది నిజంగా ఆత్మహత్య సదృశ్యమే. ఇలా జాతీయ స్థాయిలోనూ కనిపిస్తూ ఉంటుంది. తాజాగా తెలంగాణలో జరుగుతున్న పరిస్థితులు కూడా ఇందుకు భిన్నంగా ఏమీ లేవు. రేవంత్ సిఎంగా పటిష్ట నిర్ణయాలు తీసుకుంటూ పని చేసుకుంటూ పోతుంటే, మిగతా వాళ్ళు ఆయనకు అంతగా మద్దతుగా నిలుస్తున్నట్లు లేదు. ఉమ్మడి తనం ఏమాత్రం కనిపించడంలేదు. కేవలం రేవంత్ మాత్రమే అందరినీ కలుపుకుని పోయేలా ఉంటున్నారు. పిసిసి చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ కూడా పెద్దగా పార్టీని గాడిలో పెట్టే ప్రయత్నాలు చేయడం లేదు. పార్టీలో వ్యతిరేకంగా పనిచేయడం పట్ల కాంగ్రెస్ అధిష్ఠానం సీరియస్ గా పరిగణించి..రేవంత్ రెడ్డికి పూర్తి అధికారం ఇచ్చి నడిపించడం లేదు. అధిష్ఠానం కర్నాటక, తెలంగాణలను పిండేస్తోందన్న ఆరోపణలు వస్తున్నాయి. హైదరాబాద్ భూముల అమ్మకం వెనకా అద్రుశ్య ఒత్తిళ్లు ఉన్నాయని అంటున్నారు. కేంద్రంలో బీజేపీ బలహీన పడితే, ఆ పరిస్థితి ఒక్క కాంగ్రెస్ పార్టీకి మాత్రమే లాభిస్తుంది. కొన్ని రాష్ట్రాల్లో మాత్రమే బీజేపీ, కాంగ్రెస్ పోటాపోటీగా ఉన్నాయి. కొన్ని రాష్ట్రాల్లో బీజేపీ ఎంత బలహీనపడినా, కాంగ్రెస్ పూర్వ వైభవాన్ని సంతరించుకోవడం అనుమానంగానే కనిపిస్తున్నది. అనేక రాష్ట్రాల్లో ప్రాంతీయ పార్టీలు బలంగా మారి, బీజేపీకి, కాంగ్రెస్ కి సవాల్ గా నిలుస్తున్నాయి. ఈ నేపథ్యంలో అధికారంలోకి వచ్చిన టీ కాంగ్రెస్ గత బిఆర్ఎస్ పాలనకు భిన్నమైన పరిపాలనను అందించాలి. విమర్శలు కట్టిపెట్టి ప్రజల కోసం అంతా కలసికట్టుగా పనిచేయాలి. సున్నితమైన అంశాల వాదవివాదాలను పక్కన పెట్టడమే బెటర్. సొంత, బయటి పార్టీల అభిప్రాయాలను పక్కనపెట్టి, ప్రజాభిప్రాయాన్ని అనుసరించి నడుచుకోవాలి. అప్పుడే పార్టీకి ప్రజాదరణ పెరుగుతుంది. కాదంటే కాంగ్రెస్ గతానుభవాలు పునరావృతం కాగలవు. తస్మాత్ జాగ్రత్త!

రజతోత్సవాలపై నియోజకవర్గాల వారీగా సమావేశాలు

మొదటిపేజీ తరువాయి..

సన్నాహక సమవేశం నిర్వహించారు. ఉమ్మడి మెదక్, నిజామాబాద్ జిల్లాల ముఖ్యనేతలు సమావేశానికి హాజరయ్యారు. ఈ నెల 27న జరగనున్న బీఆర్ఎస్ రజతోత్సవ సభ ఏర్పాట్లపై కేసీఆర్ పార్టీ నేతలకు దిశానిర్దేశంచేశారు. నియోజకవర్గానికి లక్ష మందికి తగ్గకుండా సభకు తరలించేలా ప్రణాళిక రూపొందించాలన్నారు. మహాసభ ప్రజలకు మనోధైర్యం వచ్చేలా ఉండాలని.. మహాసభకు సంబంధించిన అన్ని ఏర్పాట్లు-చూసుకోవాలని నేతలకు సూచించారు. సమావేశంలో బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ-ఆర్, మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్ రావు, ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్, ఎమ్మెల్యేలు, సిద్దిపేట జిల్లా పార్టీ అధ్యక్షుడు కే ప్రభాకర్ రెడ్డి, సంగారెడ్డి జిల్లా పార్టీ అధ్యక్షుడు చింత ప్రభాకర్, మాణిక్ రావు, మెదక్ జిల్లా పార్టీ అధ్యక్షురాలు పద్మ దేవేందర్ రెడ్డి, ఎమ్మెల్సీ డాక్టర్ యాదవ్ రెడ్డి, సునీత లక్ష్మారెడ్డి, మాజీ ఎమ్మెల్సీ శేరీ సుభాష్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు క్రాంతి కిరణ్, భూపాల్ రెడ్డి, పార్టీ నేతలు జైపాల్ రెడ్డి, ఆదర్శ్ రెడ్డి పాల్గొన్నారు. ఉమ్మడి నిజామాబాద్‌కు చెందిన నేతలు, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు బాజిరెడ్డి గోవర్ధన్, గణేశ్ గుప్తా, గంప గోవర్ధన్, జాజుల సురేందర్, హనుమంత్ షిండే, నిజామాబాద్ జిల్లా పార్టీ అధ్యక్షుడు ఆశన్న గారిజీవన్ రెడ్డి, కామారెడ్డి జిల్లా పార్టీ అధ్యక్షుడు ముజీబుద్దీన్, ఆయేషా షకీల్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

అభ్యంతరమెందుకు?

మొదటిపేజీ తరువాయి..

అందరికీ భూములు ఇచ్చారని.. ఇళ్లు కట్టించారని అన్నారు. అసైన్డ్ భూములు ఇందిరాగాంధీ ఇచ్చారన్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల తీర్మానం ఆమోదించిన తేదీ ఫిబ్రవరి 4 అని.. ఫిబ్రవరి 4ను సోషల్ జస్టిస్ డే గా జరుపుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుందన్నారు. తెలంగాణలో కులగణన చేసి బీసీల లెక్క 56.36 శాతం అని తేల్చిందని.. గుజరాత్ సహా దేశంలో ఏ రాష్ట్రంలోనూ కులగణన చేయలేదన్నారు. రాహుల్ గాంధీ మాట ప్రకారం తెలంగాణ మొట్టమొదటి సారి కులగణన చేసిందన్నారు.

స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు పెంచమన్న డిమాండ్ మాత్రమే కాదు, ఉద్యోగ, విద్య రంగంలో కూడా ఈ పెంపు ఉండాలని నిర్ణయించామన్నారు.

రిజర్వేషన్ల పెంపు కేంద్ర ప్రభుత్వ పరిధిలో ఉన్న వ్యవహారమని.. అందుకే మేము తీర్మానం చేసి కేంద్రానికి పంపించామని తెలిపారు. మేము మా రాష్ట్రంలో పెంచుకుంటాం అన్నాం. మీ రాష్ట్రంలో చేయమని మేము అడగలేదు. మా రాష్ట్రంలో రిజర్వేషన్లు పెంచితే నరేంద్ర మోదీకి వచ్చిన కష్టమేంటి? మా పిల్లల చదువులు, ఉద్యోగాలు, రాజకీయ అవకాశాల కోసం 42 శాతం ఇవ్వాలని మేం ప్రయత్నం చేస్తుంటే.. మీకు ఏం కష్టం వచ్చింది? మా తీర్మానం ప్రకారం రిజర్వేషన్లు పెంచమని కోరుతూ బీజేపీ నేతలను బీసీ సంఘాలు కలిశాయి. అయినా ఉలుకు లేదు. పలుకు లేదు. అందుకే ఢిల్లీలో బీసీ మహా ధర్నా చేపట్టాల్సిన పరిస్థితి బీసీ సంఘాలకు ఏర్పడిందని సిఎం రేవంత్ అన్నారు. కురుక్షేత్ర యుద్ధంలో చెప్పినట్టు- 'అయిననూ హస్తిన పోయి రావలె'.. అన్నట్లు ఢిల్లీకి వచ్చి ధర్నా చేస్తున్నారు. మా మీద ఆధిపత్యం చెలాయించాలని చూడొద్దు. నిజాం పాలకులకు ఏ గతి పట్టిందో చూశారు. ఆంధ్రా పాలకులకు ఏం జరిగిందో చూశారు. మీరెప్పుడూ ఢిల్లీలో ఉండరు. గల్లీలోకి రావాల్సిందే. చిన్న సాయం చేస్తే జీవితాంతం గుర్తుపెట్టుకునే జాతులు మా బీసీ జాతులు. ఈ జాతులకు అన్యాయం చేస్తే ఎలా మర్చిపోతారు? దేశమంతటా మీరు అమలు చేస్తారా లేదా అని నేను అడగడం లేదు. మా తెలంగాణలో తీర్మానం చేసిన ప్రకారం పెంచమని మాత్రమే అడుగుతున్నాను' అని రేవంత్ అన్నారు. రాజకీయ పార్టీలన్నీ వ్యతిరేకించినా సరే అనేక బిల్లులు తెచ్చి చట్టాలు చేశారన్నారు. ట్రిపుల్ తలాఖ్ తెచ్చారని.. ఆర్టికల్ 370 రద్దు చేశారని... వ్యవసాయంపై నల్ల చట్టాలు తెచ్చారని తెలిపారు. మరి రిజర్వేషన్లను 42 శాతానికి పెంచడానికి ఏం సమస్య వచ్చిందని ప్రశ్నించారు. బీసీల కోసం ప్రాణాలు ఇస్తామని బండి సంజయ్ అంటారని.. 'మాకు మీ ప్రాణాలు వద్దు. 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వండి చాలు' అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.

ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద నిర్వహించిన బీసీ గర్జన మహా ధర్నాకు వివిధ పార్టీల ఎంపీలు మద్దు తెలిపారు. అసదుద్దీన్ ఓవైసీ, డీఎంకే కనిమొలి, ఎన్సీపీ ఎంపీ సుప్రియ సూలే మహాధర్నాకు మద్దతు ఇస్తూ ధర్నాలో పాల్గొన్నారు. అలాగే ఈ ధర్నాకు ప్రెసిడెంట్ మహేష్ కుమార్ గౌడ్, మంత్రులు పొన్నం ప్రభాకర్,కొండ సురేఖ, విప్ ఆది శ్రీనివాస్, ఎమ్మెల్యేలు శ్రీహరి ముద్దిరాజు, మక్కన్ సింగ్ రాజ్ ఠాకూర్, బిర్లా ఐలయ్య, వీర్లపల్లి శంకర్, ప్రకాష్ గౌడ్, ఎమ్మెల్సీ కోదండరాం, విహెచ్, మాజీ ఎంపీ అంజన్ కుమార్ హాజరయ్యారు.

ఫిరాయింపు ఎమ్మెల్యేలపై స్పీకర్ చర్యలేవి?

మొదటిపేజీ తరువాయి..

బీజేపీ నేత మహేశ్వర్ రెడ్డి దాఖలు చేసిన పిటిషన్లపై సుప్రీంకోర్టు విచారణ చేపట్టి వారి తరపు లాయర్ల వాదనలు విన్నది. బుధవారం నాడు స్పీకర్ తరపున లాయర్ ముకుల్ రోహత్గి వాదనలు వినిపించారు. స్పీకర్ చర్యలు తీసుకోవాలని సైతం ధర్మాసనం ఆదేశించలేదా, ఫిరాయింపుల అంశంపై స్పీకర్ చర్యలు తీసుకోకున్నా తాము చూస్తూ ఉండిపోవాలా అని సుప్రీం ధర్మాసనం ప్రశ్నించింది. అసెంబ్లీ కార్యదర్శి తరపున సీనియర్ లాయర్ అభిషేక్ మను సింగ్వీ వాదనలు వినిపించనున్నారు. నేటి ఉదయం 10 గంటలకు ధర్మాసనం సమయం కేటాయించింది. సకాలంలో ఫిరాయింపు ఎమ్మెల్యేలపై చర్యలు తీసుకోవాలని స్పీకర్ కు సూచించలేమా అని జస్టిస్ బీఆర్ గవాయ్ ప్రశ్నించారు. ఎమ్మెల్యేలపై చర్యలు తీసుకోవాలని స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ కు బీఆర్ఎస్ నేతలు ఫిర్యాదు చేసిన వారం రోజుల్లోనే కోర్టులో పిటిషన్ వేశారని ముకుల్ రోహత్గి తెలిపారు. స్పీకర్ కు దీనిపై ఆలోచించుకునే సమయం కూడా ఇవ్వకుండా, ఒక పిటిషన్ తరువాత మరో పిటిషన్ వేస్తూ పోయారని సుప్రీంకోర్టు ధర్మాసనం దృష్టికి తీసుకొచ్చారు. కోర్టులు రాజ్యాంగ పరిరక్షకులుగా ఉంటాయని జస్టిస్ బీఆర్ గవాయ్ అన్నారు. ఇప్పటికే ఏడాది ముగిసింది, మరో నాలుగేళ్లు స్పీకర్ చర్యలు తీసుకోకపోయినా కోర్టులు ఎలాంటి ఆదేశాలు జారీ చేయకూడదా.. ఇలాగే చూస్తూ ఉండిపోవాలా అని ముకుల్ రోహత్గీని ప్రశ్నించారు. పిటిషనర్ల ఇష్టానుసారం అసెంబ్లీ స్పీకర్ నిర్ణయాలు తీసుకోరని, గత ఏడాది మార్చి 18న పిటిషనర్లు స్పీకర్ కు ఫిర్యాదు చేయగా.. ఈ జనవరి 16న ఫిరాయింపు ఎమ్మెల్యేలకు స్పీకర్ నోటీసులు జారీ చేశారని ముకుల్ రోహత్గీ అన్నారు.

ఈ పిటిషన్లపై ఫిర్యాదులు ఇచ్చినా స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ఎందుకు చర్యలు తీసుకోలేదని కోర్టు పలుమార్లు అసహనం వ్యక్తం చేసింది. కోర్టు ఫిరాయింపులకు వార్షికోత్సవం పూర్తయిందా అంటూ ధర్మాసనం సెటైర్లు వేసింది. ఎమ్మెల్యేల ఫిరాయింపులపై ఫిర్యాదులు వచ్చినా చర్యలు తీసుకోకుండా, ఎందుకు జాప్యం జరిగిందని స్పీకర్ కు, తెలంగాణ ప్రభుత్వానికి కౌంటర్ దాఖలు చేయాలని సుప్రీంకోర్టు గతంలోనే నోటీసులు ఇచ్చింది. కాగా తెలంగాణలో ప్రతిపక్ష భారత రాష్ట్ర సమితి నుంచి అధికార కాంగ్రెస్ పార్టీలోకి జంప్ అయిన ఎమ్మెల్యేల కేసులో ఈ రోజు సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. ఇప్పటికే ఈ అనర్హత వేటు విషయమై తెలంగాణ స్పీకర్ కు సుప్రీంకోర్టు తలంటు పోసిన సంగతి తెలిసిందే కదా. తాజాగా సుప్రీంకోర్టులో తెలంగాణ స్పీకర్ తరపున ముకుల్ రోహిత్గి కీలక వాదనలు వినిపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర అసెంబ్లీ స్పీకర్ కు రాజ్యాంగం కల్పించిన విశేషాధికారాలను కోర్టులు హరించలేవని ఈ సందర్భంగా తెలిపారు. సభాపతి ఒకసారి నిర్ణయం తీసుకున్నాకే జ్యుడిషియల్ సమీక్షకు అవకాశం ఉంటుందన్నారు. అసెంబ్లీ స్పీకర్ కాలపరిమితితో నిర్ణయం తీసుకోవాలని కోర్టు చెప్పడం సరికాదన్నారు. స్పీకర్ సరైన సమయంలో నిర్ణయం తీసుకోవాలని సూచించలేమా అని జస్టిస్ గవాయ్ ముకుల్ రోహిత్గిని ప్రశ్నించారు. కోర్టులు రాజ్యంగ పరిరక్షకులుగా వ్యవహరిస్తాయన్న న్యాయమూర్తి... స్పీకర్ చర్యలు తీసుకోకపోతే కోర్టులు చూస్తూ ఉండాల్సిందేనా అని న్యాయమూర్తి ప్రశ్నించారు. ఇక బీఆర్ఎస్ నుంచి గెలిచి కాంగ్రెస్ పార్టీ లో చేరిన మొత్తం 10 మంది ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలని కోరుతూ జనవరి 15న బీఆర్ఎస్ సుప్రీంకోర్టును ఆశ్రయించింది. ఇప్పటికే అందులో గూడెం మహిపాల్ రెడ్డితో పాటు పలువురు ఎమ్మెల్యేలు కొందరు సొంత పార్టీ వైపు అడుగులు వేస్తున్నట్టు కనిపిస్తోంది. ఇందులో ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ పై అనర్హత వేటు పడే ఛాన్సెస్ ఎక్కువగా ఉన్నట్టు కనిపిస్తోంది. ఆయన బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేగా కొనసాగుతూనే.. కాంగ్రెస్ పార్టీ తరుపున గత సార్వత్రిక ఎన్నికల్లో సికింద్రాబాద్ లోక్ సభ సభ్యుడిగా పోటీ చేసిన సంగతి తెలిసిందే కదా. దీంతో ఆయనపై అనర్హత వేటు పడటం గ్యారంటీ అని చెబుతున్నారు. మరోవైపు మిగిలిన ఎమ్మెల్యేలపై అనర్హత విషయంలో ఎలాంటి పరిణామం చోటు చేసుకుంటుందో చూడాలి.

లోక్‌సభ ముందుకు వక్ఫ్ సవరణ బిల్లు

మొదటిపేజీ తరువాయి..

కేసులో పార్లమెంట్ భవనంతో సహా అనేక ఆస్తులు ఉన్నాయన్నారు. ఢిల్లీ వక్ఫ్ బోర్డు వీటిని క్లెయిమ్ చేసింది.. ఈ కేసు ప్రస్తుతం కోర్టులో ఉందని గుర్తు చేశారు. కానీ అప్పుడు యుపిఎ 123 ఆస్తులను డీనోటిఫై చేసి వక్ఫ్ బోర్డుకు ఇచ్చిందని కేంద్ర మంత్రి రిజిజు పేర్కొన్నారు. అయితే ఈ వక్ఫ్ సవరణ బిల్లు ఈ రోజు లోక్‌సభలో ప్రవేశపెట్టకుంటే.. పార్లమెంట్ భూమి సైతం వక్ఫ్ ఆస్తి అనే అవకాశముందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రస్తుతం వక్ఫ్ చట్టంలోని పలు క్రూరంగా పరిగణించే అంశాలను తమ ప్రభుత్వం తొలగించిందన్నారు. అంతేకాకుండా.. దక్షిణ భారతంలోని పలు రాష్ట్రాలు తమిళనాడు, కర్ణాటకలోని పలు దేవాలయాలతోపాటు హర్యానాలోని వివిధ గురుద్వార్‌లను ముస్లిం సమాజం వక్ఫ్ భూమిగా క్లయిమ్ చేసిందని రిజిజు ఈ సందర్భంగా వివరించారు. అయితే తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేయకూడదంటూ.. ప్రతిపక్షాలకు కేంద్ర మంత్రి రిజిజు చురకలంటించారు. ఈ అంశాన్ని రాజకీయం చేయడానికి ప్రతిపక్షాలు నడుం బిగించాయని మండిపడ్డారు. ఈ బిల్లుపై అన్ని వర్గాల అభిప్రాయాలు తీసుకున్నామని ఆయన ఈ సందర్భంగా వెల్లడించారు. ఈ బిల్లును తీసుకురాకపోతే.. పార్లమెంట్ భూమిని కూడా వక్ఫ్ ఆస్తిగా చెబుతారని అన్నారు. బిల్లు గురించి విపక్షాలు అసత్య ప్రచారం చేశాయి. అందులోని అంశాలను లేవనెత్తి ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నాయి. 1954లో తొలిసారి వక్ఫ్ చట్టం అమల్లోకి వచ్చింది. అది అప్రజాస్వామికం అని ఆనాడు ఎవరూ చెప్పలేదు. పార్లమెంట్ ఉభయ సభ్యులతో కూడిన జేపీసీకి అభినందనలు. మొత్తం 284 ప్రతినిధులు, 25 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల వక్ఫ్ బోర్డులు జేపీసీలో తమ వాదనలు వినిపించాయి. మేం బిల్లులో కొన్ని సానుకూల మార్పులు చేస్తే.. మమ్మల్ని ఎందుకు ప్రశ్నిస్తున్నారు. ఈ బిల్లు తీసుకుని రాకపోతే.. కొందరు పార్లమెంట్ భవనాన్ని కూడా వక్ఫ్ ఆస్తిగా పేర్కొంటారని సంచలన వ్యాఖ్యలు చేశారు. అయితే ఈ స్పందనకు గతంలో ఏఐయూడీఎఫ్ చీఫ్ బద్రుద్దీన్ అజ్మల్ చేసిన వ్యాఖ్యలు కారణం. దేశ రాజధానిలోని పార్లమెంట్ భవనం, దాని పరిసర ప్రాంతాలు వక్ఫ్ ఆస్తికి సంబంధించినవని అజ్మల్ అప్పట్లో వాదించారు. వక్ఫ్ బిల్లు ముస్లిం సమాజానికి చెందిన మత విశ్వాసాలకు ఎలాంటి ఆటంకం కలిగించదు. ఇది కేవలం ఆస్తుల నిర్వహణకు సంబంధించిన విషయం మాత్రమే. ఈ బిల్లుకు మద్దతిచ్చేవారు, వ్యతిరేకించే వారు ఎప్పటికీ గుర్తుండిపోతారు. పేద ముస్లింలకు వక్ఫ్ ఆస్తులను ఉపయోగించాలి. వారిని అలా వదిలేయకూడదు. వారి ఉన్నతి కోసం మోదీ ప్రభుత్వం ఏవైనా చర్యలు తీసుకుంటే ఎందుకు వ్యతిరేకిస్తున్నారని అన్నారు. ముస్లిం ప్రతినిధులు ఆ బిల్లును ఆహ్వానించారు. వీలైనంత త్వరగా దీనికి ఆమోదం లభించాలని ఆ వర్గంలోని పేదలు కోరుకుంటున్నారు. అలాగే రిజిస్టర్ చేసిన ఆస్తి విషయంలో ఎవరూ జోక్యం చేసుకోరు. ప్రభుత్వం తీసుకువచ్చిన సంస్కరణలతో ముస్లిం మహిళలు, పిల్లలకు వారి హక్కులు దక్కుతాయి. ప్రభుత్వ భూమి విషయంలో వివాదం తలెత్తితే కలెక్టర్ కంటే పైస్థాయి వ్యక్తి తీర్పు ఇవ్వాలంటూ జేపీసీ చేసిన ప్రతిపాదనను మేం అంగీకరించాం అని రిజిజు స్పష్టత ఇచ్చారు. మరోవైపు విపక్షాలు దీనిని వ్యతిరేకిస్తున్నాయి. ఈ బిల్లుకు వ్యతిరేకంగా కోల్‌కతాలో మార్చ్ జరిగింది. ఇక ఈ వక్ఫ్ బోర్డు విషయంతో తాము క్లియర్‌గా ఉన్నామని ఆయన స్పష్టం చేశారు. ఆ క్రమంలో కేంద్ర, రాష్ట్ర వక్ఫ్ బోర్డ్‌లలో ఇద్దరు ముస్లిమేతర వ్యక్తులు ఉండాలని నిర్ణయించామన్నారు. అలాగే ఈ వక్ఫ్ బోర్డులల్లో ముస్లిం మహిళలకు చోటు- ఉండడం లేదని తెలిపారు. దీంతో ఈ బోర్డుల్లో ఇద్దరు ముస్లిం మహిళలకు స్థానం కల్పిస్తామన్నారు. మరోవైపు బిహార్ అసెంబ్లీ ఎన్నికలు ఈ ఏడాదిలో జరగనున్నాయని.. ఆ రాష్ట్రంలో 17 శాతం మైనార్టీల ఓట్లు- ఉన్నాయి. అందుకోసమే ఈ బిల్లును తీసుకు వస్తున్నారంటూ ప్రతిపక్షాలు ఆరోపణ చేస్తున్నాయి. అంతకు ముందు కాంగ్రెస్ పార్టీ సభ్యులు గౌరవ్ గోగోయ్ మాట్లాడుతూ.. ఈ బిల్లుపై తప్పు దొవ పట్టించే ప్రయత్నాన్ని కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు చేస్తున్నారంటూ మండిపడ్డారు. అంతేకాకుండా.. ఈ బిల్లు సవరణలు సమర్పించడానికి ఒక ఏడాది ముందు, 2023లో జరిగిన పార్లమెంటరీ కమిటీ- నాలుగు సమావేశాలు జరిగాయని.. వాటిలో దేనిలోనూ మైనారిటీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఈ బిల్లును ఎందుకు ప్రస్తావించలేదని కేంద్ర ప్రభుత్వాన్ని రంజన్ గొగోయ్ సూటిగా ప్రశ్నించారు. ఈ నేపథ్యంలో కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు పై విధంగా స్పందించారు.

సెంట్రల్ వర్సిటీ భూములపై విచారణ

మొదటిపేజీ తరువాయి..

తెలంగాణ హైకోర్టు గురువారానికి వాయిదా వేసింది. ఈ భూముల్లోని చెట్లను గురువారం వరకు కొట్టివేయొద్దని ప్రభుత్వాన్ని ఆదేశించింది. కంచ గచ్చిబౌలి భూ వివాదంపై బుధవారం హైకోర్టులో విచారణ జరిగింది. పిటిషనర్ తరఫు సీనియర్ కౌన్సిల్ రవిచంద్.. తన వాదనలు వినిపించారు. జీవో 54ను రద్దు చేయాలని కోరుతూ వాదనలు జరిగాయి. వట ఫౌండేషన్ తరఫున సీనియర్ లాయర్ నిరంజన్ రెడ్డి వాదనలు వినిపించారు. ఆ క్రమంలో నిబంధనలకు విరుద్ధంగా టీజీఐఐసీకి భూములు అప్పగించారని తెలిపారు. ఈ భూములపై వట ఫౌండేషన్, హెచ్‌సీయూ విద్యార్థులు దాఖలు చేసిన పిటిషన్లపై హైకోర్టులో విచారణ జరిగింది. ఈ భూమిని జాతీయ ఉద్యానవనంగా గుర్తించాలని పిటిషన్‌లో పేర్కొన్నారు. దీంతో హైకోర్టు విచారణ చేపట్టింది. సుప్రీంకోర్టు తీర్పునకు విరుద్ధంగా ప్రభుత్వం భూములను టీజీఐఐసీకి అప్పగించిందన్నారు. 2003లో 400 ఎకరాలను అప్పటి ప్రభుత్వం ఐఎంజీ అకడమిక్ భారత్‌కు విక్రయించారని వివరించారు. అంటే.. 5-8-2003లో నాడు ఎకరా భూమిని రూ. 50 వేలకు విక్రయించారని తెలిపారు. ఆ సమయంలో ఒక ఎకరం భూమి రూ. 26 లక్షలు విలువ ఉంటే.. కేవలం రూ. 50 వేలకు విక్రయించారని హైకోర్టు దృష్టికి ఆయన తీసుకు వెళ్లారు. ఇక 2006లో ప్రభుత్వం మారగానే ఈ భూముల విక్రయం.. నిబంధనలకు విరుద్ధంగా జరిగిందని.. ఈ నేపథ్యంలో వాటిని వెనక్కి తీసుకుందని తెలిపారు. నాటి నుంచి ఐఎంజీ భారత్ కోర్టులో ఈ భూమి కోసం పోరాడుతుందని గుర్తు చేశారు. ఐఎంజీ కేసులో ఇప్పటి వరకు ఈ భూమి ఫారెస్ట్ ఏరియా అని ఒక్క వాదన కూడా జరగలేదని..ఈ విషయాన్ని గమనించాలని హైకోర్టును ఆయన కోరారు.

ఉద్రిక్తంగా హెచ్‌సీయూ ప్రాంతాలు

మొదటిపేజీ తరువాయి..

నిరసనలు కొనసాగుతూనే ఉన్నాయి. ఇక బుధవారం ఉదయమే హెచ్‌సీయూ క్యాంపస్‌ను వేలాది మంది పోలీసులు చుట్టుముట్టారు. క్యాంపస్ చుట్టూ బారికేడ్లు ఏర్పాటు చేశారు. యూనివర్సిటీ లోపలికి బయటి వ్యక్తులను రానివ్వకుండా, విద్యార్థులను బయటకు రానివ్వకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా బుధవారం ఉదయం హెచ్‌సీయూ క్యాంపస్‌లో ప్రొఫెసర్లు, విద్యార్థులు నిరసన చేపట్టారు. ఈ క్రమంలో పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శించారు. శాంతియుతంగా నిరసన తెలుపుతున్న ప్రొఫెసర్లు, విద్యార్థులపై పోలీసులు లాఠీలు ఝుళిపించారు. దొరికిన విద్యార్థులను దొరికినట్లు లాఠీలతో చితకబాదారు. పోలీసుల తీరుపై ప్రొఫెసర్లు విద్యార్థులు తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. రేవంత్ సర్కార్‌కు వ్యతిరేకంగా నినదిస్తూ, పోలీస్ జులుం నశించాలని నినాదాలు చేశారు. దీంతో హెచ్‌సీయూ క్యాంపస్‌లో ఉద్రిక్త వాతావరణం ఏర్పడింది. విద్యావంతులైన ప్రొఫెసర్ల లాఠీచార్జీ చేయడం అత్యంత బాధాకరమని మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో గత నాలుగు రోజుల నుంచి నిరసనలు కొనసాగుతూనే ఉన్నాయి. బుధవారం ఉదయం శాంతియుతంగా నిరసన చేపట్టిన ప్రొఫెసర్లు, విద్యార్థులపై పోలీసులు లాఠీఛార్జ్ చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. ఇందిరమ్మ కాలం నాటి ఎమర్జెన్సీని రేవంత్ రెడ్డి సోకాల్డ్ ప్రజాపాలన తలపిస్తుందని హరీశ్‌రావు ధ్వజమెత్తారు. హెచ్‌సీయూ విద్యార్థులు, వారికి మద్దతుగా నిలిచిన ప్రొఫెసర్లపై లాఠీ ఛార్జ్ చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాం అని హరీశ్‌రావు పేర్కొన్నారు. పచ్చని అడవిని నాశనం చేయొద్దని శాంతియుతంగా నిరసనకు దిగిన విద్యార్థులపై పోలీసుల లాఠీచార్జ్ చ

ప్రారంభమైన వల్మీడి రాములోరి బ్రహ్మోత్సవాలు

జనగామ, ఏప్రిల్ 2(అడుగు న్యూస్):
జనగామ జిల్లా, పాలకుర్తి మండలం, వల్మీడి శ్రీ సీతారామచంద్ర స్వామి

వారి బ్రహ్మోత్సవాలు స్వామి వారి గుట్ట ప్రవేశంతో ప్రారంభమయ్యాయి. ఈ పూజల్లో ఆలయ ఈఓ మోహన్ బాబు, ఆలయ అర్చకులు, ఆలయ సూపరింటెండెంట్ వెంకటయ్య, ఆలయ సిబ్బంది, గ్రామ పెద్దలు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ సాయం

రాయపర్తి, ఏప్రిల్ 2 (అడుగు న్యూస్):
రాయపర్తి మండల కేంద్రానికి చెందిన పిల్లి కృష్ణకాంత్ ఇటీవల మరణించడంతో, ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ బాధిత కుటుంబానికి అండగా

నిలిచింది. బుధవారం ఫౌండేషన్ వర్కింగ్ ప్రెసిడెంట్ లేతకుల రంగారెడ్డి ఆ కుటుంబాన్ని పరామర్శించి, ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ ఛైర్మెన్ పరుపాటి శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో 50 కేజీల బియ్యం, ఆయిల్ క్యాన్ అందజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి పూస మధు, ఫౌండేషన్ ప్రతినిధి గజవెల్లి ప్రసాద్, మాజీ సర్పంచ్ గారే నర్సయ్య, మాజీ ఎంపీటీసీ ఐత రాంచందర్, గ్రామ పార్టీ ప్రధాన కార్యదర్శి చందు రామ్, చిన్నల ఉప్పలయ్య, గబ్బేట యాకయ్య, ఎండీ యూసఫ్, గుడ్ల గురునాథం, చందు సతీష్, ఉబ్బని సింహాద్రి, మైస వెంకటేశం, కిషోర్, ఐత రవి, పిరని రాజు, అశోక్, పిరని రవీందర్, గారే నరేష్ తదితరులు పాల్గొన్నారు.

వర్ధన్నపేటలో కలకలం

వర్ధన్నపేట, ఏప్రిల్ 2(అడుగు న్యూస్):
వరంగల్ జిల్లా, వర్ధన్నపేటలో పట్టపగలే వృద్ధురాలి వద్ద నుంచి రూ. 3 లక్షలు దొంగిలించిన ఘటన కలకలం రేపింది. ఎస్బిఐ బ్యాంకు నుండి నందనం భారతమ్మ రూ. 3 లక్షలు డ్రా చేసుకుని బయటికి రాగా,

నడవడానికి కష్టపడుతున్న పరిస్థితిని ఓ దొంగ ఆసరాగా తీసుకున్నాడు. "నేను మీ ఇంటివైపే వెళుతున్నాను" అని నమ్మబలికి బైక్‌పై ఎక్కించుకుని కొంత దూరం తీసుకెళ్లాడు. మార్గమధ్యంలో డబ్బులు లాక్కొని ఆమెను కిందికి తోసేసి పరారయ్యాడు. భారతమ్మ కేకలు వేయగా స్థానికులు పట్టుకోడానికి యత్నించినా, దొంగ తప్పించుకున్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని సీసీ కెమెరాల ఆధారంగా దర్యాప్తు ప్రారంభించారు.

భారత్ సహా పలు దేశాలపై ట్రంప్ టారిఫ్‌ల బాదుడు!

మొదటిపేజీ తరువాయి..

చాలా ఏళ్లుగా ప్రపంచ దేశాలతో ఉదారంగా వ్యవహరించామన్న ట్రంప్, చరిత్రలో ఏ దేశాన్నీ దోచుకోని విధంగా అవి అమెరికాను దోచుకున్నాయని మండిపడ్డారు. అమెరికా వ్యవసాయ ఉత్పత్తులపై భారత్ 100శాతం సుంకాలు వసూలు చేస్తోందని శ్వేతసౌధం మీడియా కార్యదర్శి కరోలిన్ లీవిట్ అన్నారు. అమెరికాపై అత్యధిక సుంకాలు వసూలు చేస్తున్న దేశాల

జాబితాను కరోలిన్ మీడియాకు చూపించారు. ఆయా దేశాలు చాలా కాలంగా అమెరికాను టారిఫ్‌ల రూపంలో పీల్చేస్తూ, అన్యాయమైన వాణిజ్య విధానాలను అవలంబిస్తున్నాయన్నారు. అమెరికా డెయిరీ ఉత్పత్తులపై ఐరోపా సమాఖ్య 50శాతం, బియ్యంపై జపాన్ 700 శాతం, వ్యవసాయ ఉత్పత్తులపై భారత్ 100 శాతం, ఆల్కహాల్ పానియాలపై 150 శాతం, బటర్, చీజ్‌పై కెనడా 300 శాతం టారిఫ్ వసూలు చేస్తున్నాయని వెల్లడించారు. తమ ఉత్పత్తులను ఆయా మార్కెట్లకు పంపించడం అసాధ్యంగా మారిందన్న కరోలిన్, అమెరికన్ల వ్యాపారాలు దెబ్బతింటున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. అందుకే ఆయా దేశాలపై ప్రతీకార సుంకాలు విధించేందుకు ఇదే సమయమన్నారు. అమెరికా నుంచి భారత్‌కు దిగుమతి అవుతున్న మందులపై 10 శాతం పన్ను పడుతోంది. అందువల్ల భారత్ నుంచి అమెరికాకు ఎగుమతి అవుతున్న ఔషధాలపై 10 శాతం పన్ను పడొచ్చని పరిశ్రమ వర్గాలు భావిస్తున్నాయి. మరోవైపు ట్రంప్ నిర్ణయంతో అమెరికా ఫైనాన్షియల్ మార్కెట్లు, వ్యాపారాల్లో అనిశ్చితి నెలకొనవచ్చని నిపుణులు అభిప్రాయపడ్డారు.

భారత రాజ్యాంగ పరిరక్షణ మనందరి బాధ్యత

రాయపర్తి, ఏప్రిల్ 2(అడుగు న్యూస్):
పాలకుర్తి నియోజకవర్గ పరిధిలో, రాయపర్తి మండలం, కాట్రపల్లి గ్రామం నుండి బురహాన్

పల్లి గ్రామం వరకు ఏఐసీసీ, పిసిసి ఆదేశాల మేరకు "జై బాపు, జై భీమ్, జై సంవిధాన్" నినాదాలతో రాజ్యాంగ పరిరక్షణ సన్నాహ సమావేశం, పాదయాత్ర నిర్వహించగా ఈ కార్యక్రమాన్ని పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి, వరంగల్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభించారు. పాదయాత్రలో ప్రజలు, మహిళలు కోలాట నృత్యాలతో, డప్పు చప్పుళ్ళతో పాదయాత్ర చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యశస్విని రెడ్డి మాట్లాడుతూ, రాజ్యాంగ పరిరక్షణ ప్రతి పౌరుడి బాధ్యత అని, కేంద్ర హోం మంత్రి అమిత్ షా చేసిన వ్యాఖ్యలకు నిరసనగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు తెలియజేయాలని, స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయాన్ని సాధించేందుకు ఈ కార్యక్రమాన్ని సమర్థవంతంగా వినియోగించుకోవాలని సూచించారు.

వాటర్ షెడ్ ప్రాజెక్టులు- పర్యావరణ పరిరక్షణకు కీలకం

రాయపర్తి మండలం కొలనపల్లి గ్రామంలో వాటర్ షెడ్ యాత్ర ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఎమ్మెల్యే యశస్విని రెడ్డి, అడిషనల్ కలెక్టర్ సంధ్యారాణి తో కలిసి పాల్గొన్నారు. పాఠశాల ప్రాంగణంలో మొక్కలు నాటిన ఆమె, పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని సూచించారు. భూసారం పెంపొందించేందుకు, నీటి వనరులను సమర్థవంతంగా వినియోగించేందుకు వాటర్ షెడ్ ప్రాజెక్టులు అవసరమని తెలిపారు. అనంతరం, 1079 మంది లబ్ధిదారులకు రూ. 2.09 కోట్ల వడ్డీలేని రుణాలను పంపిణీ చేశారు. గ్రామీణ మహిళల ఆర్థిక అభివృద్ధికి స్వయం సహాయ సంఘాల ద్వారా మద్దతునిస్తూ, వారికి ఆర్థిక స్వావలంబన కల్పించాలనే ఉద్దేశంతో ఈ రుణాలను అందజేసినట్లు తెలిపారు.

సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ వర్ధంతి వేడుకలు

పాలకుర్తి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ వర్ధంతి వేడుకలు నిర్వహించగా ఎమ్మెల్యే యశస్విని రెడ్డి వారి చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ,

పాపన్న గౌడ్ తెలంగాణ ప్రజల గర్వించదగ్గ యోధుడని, ఆయన జీవితం నుండి యువత ప్రేరణ పొందాలని సూచించారు. తెలంగాణ ప్రభుత్వం ఆయన సేవలను గుర్తించి అనేక కార్యక్రమాలు చేపట్టిందని తెలిపారు. ఆయా కార్యక్రమాల్లో బ్లాక్ అధ్యక్షులు, మండల అధ్యక్షులు, నియోజకవర్గ, మండల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, పెద్ద ఎత్తున ప్రజలు పాల్గొన్నారు.

అనంత శోకంతో... రేణుక అంతిమయాత్ర!

మొదటిపేజీ తరువాయి..

సరిహద్దుల్లో జరిగిన ఎన్ కౌంటర్ లో అశువులు బాశారు. ఈ ఘటన అనంతరం రేణుక శవాన్ని ఏప్రిల్ 1వ తేదీ అర్ధరాత్రి దాటాక ఆమె మృత దేహాన్ని కడవెండికి తెచ్చారు. రేణుకకు రెడ్ సెల్యూట్ చేశాయి. ఆమె సేవలను కొనియాడాయి. ప్రజా ఉద్యమాలు, విప్లవోద్యమాలపై ప్రభుత్వాల దమనకాండను నిరసిస్తూ పలువురు ప్రజా సంఘాల నాయకులు ఉపన్యాసాలిచ్చారు.

అప్పటిదాకా ఎదురు చూస్తున్న ఆ గ్రామం ఒక్కసారిగా బోరుమన్నది. ఆ రాత్రి మెలుకవతో ఉన్న గ్రామ ప్రజలంతా ఆమె శవాన్ని దర్శించి కంటతడి పెట్టుకున్నారు. ఆమెతో ఆ గ్రామానికి, తమకున్న అనుబంధాలను గుర్తు చేసుకుని వెక్కి వెక్కి ఏడ్చారు. రేణుక శవాన్ని కడవెండిలో తెలంగాణ సాయుధ పోరాట తొలి అమరుడు దొడ్డి కొమురయ్య విగ్రహం పక్కనే గల ఆమె పురాతన ఇంటి ముందు ఉంచారు. ఆమె తల్లిదండ్రులు, అన్నదమ్ములు ఊసెండి అలియాస్ జీవీకే ప్రసాద్ అలియాస్ సుఖదేవ్, మరో సోదరుడు గుండెలవిసేలా దిక్కులు పిక్కటిల్లేలా ఏడ్చారు. అక్కడే తెల్లార్లూ గ్రామమంతా మెలుకవతోనే ఆ శవం వద్దే ఉండిపోయారు. అదే చోట ప్రజల సందర్శనార్థం ఉంచిన రేణుక పార్థివ దేహ సందర్శనార్థం 2వ తేదీ తెల్లవారుజాము నుంచే జనం తాకిడి మొదలైంది. దారులన్నీ కడవెండికే మళ్ళాయి. పోలీసు నిఘా, నిర్బంధాలను సైతం లెక్క చేయకుండా, వేలాదిగా ప్రజలు తండోపతండాలుగా తరలి కడవెండికి చేరుకున్నారు. దశ దిశలా వేలాదిగా తరలివచ్చిన అభిమానులు రేణుక శవానికి పూలు చల్లి నివాళులర్పించారు.

విప్లవ పాటలతో నివాళులర్పించిన కళాకారులు!

మరోవైపు వివిధ కళాకారులు పాటలతో ఆ ప్రాంగణాన్ని హోరెత్తించారు. రేణుక శవం వద్దే డప్పు కొడుతూ, రేణుక త్యాగాలను స్మరిస్తూ పాటలు పాడారు. ఆమె త్యాగం వృథా పోదంటూ నినదించారు. విప్లవోద్యమాల్లో ప్రాణార్పణలు చేసిన వారందిరినీ గుర్తు చేస్తూ పాడిన పాటలు ప్రజలను కంటతడి పెట్టించాయి.

కామ్రేడ్ రేణుకకు రెడ్ సెల్యూట్ చేసిన ప్రజా సంఘాలు!

విప్లవ రచయితల సంఘం సహా, బంధుమిత్రుల సంఘం, వివిధ కమ్యూనిస్టు పార్టీలు, పలు ప్రజా సంఘాలు రేణుక అంతిమ యాత్రకు హాజరయ్యాయి. ఆయా సంఘాల ప్రతినిధులు కామ్రేడ్ షేక్ బందగీ, దొడ్డి కొమరయ్య నల్లా నరసింహులు ఎర్రంరెడ్డి సంతోష్ రెడ్డిల ఉద్యమాల, విప్లవోద్యమాల వారసత్వాన్ని పునికి పుచ్చుకొని సమ సమాజ స్థాపన కోసం గుమ్మడవెల్లి రేణుక పోరుబాట పట్టారు. తన జీవితంలో ఎదురైన చేదు అనుభవాలను మరెవ్వరికీ రాకూడదన్న సంకల్పంతోనే ఆమె లా చదివారు. అందులో గోల్డ్ మెడల్ సాధించారు. అనేక గ్రంథాలు చదివి, సాహిత్యాభిమానిగా మారి, రచయిత్రిగా, కవయిత్రిగా అనేక రచనలు చేశారు. ఇదే సమయంలో 1996లో పీపుల్స్ వార్ లో చేరారు. అప్పటి వార్ రాష్ట్ర కార్యదర్శి, కడవెండికే చెందిన ఎర్రంరెడ్డి సంతోశ్ రెడ్డితో వివాహమైంది. 1999 డిసెంబర్ లో కొయ్యూరు ఎన్ కౌంటర్ లో ఆయన హతమయ్యారు. 2005లో వార్ సెంట్రల్ కమిటీ సభ్యుడు శాఖమూరి అప్పారావుని వివాహం చేసుకుంది. 2010లో నల్ల మలలో జరిగిన ఎన్ కౌంటర్ లో ఆయన కూడా చనిపోయారు. తర్వాత రేణుక పలు విభాగాల్లో పని చేసింది. మావోయిస్టుల తరపున పత్రికా

ప్రకటనలు విడుదల చేయడంతో పాటు, పలు పార్టీ పత్రికలకు ఎడిటర్ గా పని చేసింది. మావోయిస్టుల్లో కీలకంగా పని చేసిన జీవీకే ప్రసాద్ అలియాస్ సుఖదేవ్ అలియాస్ ఉసెండి రేణుక సోదరుడు, ఈయన 2014లో లొంగిపోయాడు. కాగా, మారిన నిర్బంధ కాండను ఎదుర్కొనే క్రమంలో చత్తీస్‌గఢ్, ఒడిస్సా ప్రాంతాల్లో మహిళల చైతన్యం కోసం రెండు దశాబ్దాలపాటు రేణుక సాగించిన సాహిత్య ఉద్యమం చిరస్థాయిగా నిలుస్తుంది.

బీఆర్ఎస్ నేతలకు చుక్కెదురు?

రేణుక అంత్యక్రియలు ప్రారంభం అయ్యే సమయానికి మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు, జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి మృత దేహం వద్దకు చేరుకున్నారు. మృత దేహానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రజా సంఘాల నాయకులు వారిని అక్కడి నుండి వెళ్ళిపోవాలని నినదించారు. కేసీఆర్ పాలనలో బీఆర్ఎస్, మీరు కూడా ఇలాంటి బూటకపు ఎన్ కౌంటర్లే చేశారని, విప్లవోద్యమాలను పాశవికంగా అణిచివేశారని ప్రశ్నించారు. బీజేపీకి మద్దతుగా నిలిచిన బీఆర్ఎస్ కు కూడా ఈ పాపంలో పాత్ర ఉన్నట్లేనని అన్నారు. ప్రస్తుతం బీజేపీ మోడీ సర్కార్ చేసే 'ఆపరేషన్ కగార్' పట్ల బీఆర్ఎస్ పార్టీ వైఖరి వెల్లడించాలని డిమాండ్ చేశారు. దీంతో తాము 'ఆపరేషన్ కగార్' కు వ్యతిరేకమని చెప్పారు. అయితే ఈ విషయాన్ని మీ పార్టీ నేతలు కెసిఆర్, కేటిఆర్ లు ప్రకటించాలని, లేదంటే మీరు బీజేపీకి మద్దతును ఉప సంహరించుకోవాలని గొడవకు దిగారు. దీంతో వారు అక్కడి నుండి వెళ్ళిపోయారు.

అంతిమయాత్రలో పాల్గొన్న ప్రముఖులు

ఈ అంతిమయాత్రలో నివాళులర్పించి పాల్గొన్న అమరవీరుల బందు మిత్రుల సంఘం అధ్యక్షురాలు పద్మ కుమారి, పౌర హక్కుల సంఘం అధ్యక్షుడు గడ్డం లక్ష్మణ్, నారాయణరావు, వీక్షణం సంపాదకులు ఎన్ వేణుగోపాల్, శాంతక్క, విప్లవ రచయితల సంఘం కేంద్ర కమిటీ సభ్యుడు పాణి, తెలంగాణ ప్రజా ఫ్రంట్ నాయకులు రవి చందర్, బి రమాదేవి, చైతన్య మహిళా సంఘం నాయకురాలు అనురాధ, కళ, మొగిలిచర్ల భారతక్క, గాజర్ల అశోక్ అలియాస్ ఐతు, ఉస్మానియా విద్యార్థి నాయకులు పృథ్వి, స్టాలిన్, డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ నాయకులు సుదర్శన్, ఇప్ప రాంరెడ్డి, మా భూమి సంధ్య, వేముల పుష్ప, అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య పల్స నిర్మల, ప్రజా కళామండలి నుండి రాజ నర్సింహ, జర్నలిస్టు నాయకులు ఎంవీ రమణ, స్నేహలత, వనజ, మలుపు బాల్ రెడ్డి, గద్దర్ కొడుకు సూర్యం, వరవరరావు

కూతుర్లు అనల, సహజ, పవన, కటకం సతీష్, సింగరేణి కార్మిక సంఘం నాయకుడు హుస్సేన్, తెలంగాణ యూత్ ఫెడరేషన్ నాయకుడు పనికెర మోహన్ రాజు, కాకతీయ యూనివర్సిటీ విశ్రాంత ప్రొఫెసర్ కాత్యాయని విద్మహే, తెలంగాణ ఉద్యమకారుడు సిఎల్ యాదగిరి, బంధుమిత్రుల సంఘం రాష్ట్ర నాయకులు వీరస్వామి రాష్ట్ర కేంద్ర కాంగ్రెస్ సభ్యులు లక్ష్మణ్ గౌడ్ కాదే ఇన్నయ్య, కోడం కుమారస్వామి, వెన్నెల గద్దర్, సూర్యం గద్దర్, సురేష్ మహాజన్, సురేష్ దొంతి, రాజేష్, జనగామ జిల్లా కార్యదర్శి ఎం డి కాసిం, సిపిఎం మండల కార్యదర్శి మాచర్ల సారయ్య సిపిఐ మాజీ ఎమ్మెల్యే జనగామ మాజీ ఎమ్మె తదితరులు పాల్గొన్నారు.

గన్‌డౌన్‌కు మేం సిద్ధం!?

మొదటిపేజీ తరువాయి..

ప్రతినిధి అభయ్ పేరుతో లేఖను విడుదల చేశారు. అయితే, ఆ లేఖలో శాంతి చర్చల కోసం సానుకూల వాతావరణం సృష్టించాలని మావోయిస్టులు కోరారు. అందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కూడా సానుకూలంగా స్పందించాలని అన్నారు. ఛత్తీస గఢ్, ఒడిశా, జార ండ్, మధ్యప్రదేశ్, తెలంగాణలో జరుగుతోన్న హత్యాకాండను తక్షణమే ఆపేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు శాంతి చర్చలకు సిద్ధమేనని ప్రకటించాలని పేర్కొన్నారు. శాంతి చర్చల కోసం సానుకూల వాతావరణాన్ని ఏర్పాటు చేయడం కోసం, 'ఆపరేషన్ కగార్' పేరుతో ఆదివాసీ ప్రజానీకంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేస్తున్న హత్యాకాండను నిలిపివేయాలని, బస్తర్ ప్రాంతంలో మోహరించిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సాయుధ బలగాలను బ్యారక్లకే పరిమితం చేయాలని కోరారు. సాయుధ బలగాల కొత్త క్యాంపులు ఏర్పాటును నిలిపివేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ప్రతిపాదన చేశారు. ఈ ప్రతిపాదన పట్ల స్పందించకుండా, జవాబు ఇవ్వకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గత 15 నెలలుగా విప్లవోద్యమ ప్రభావిత రాష్ట్రాల్లో, ముఖ్యంగా ఛత్తీస్గఢ్ ప్రతిఘాతక 'కగార్' యుద్ధాన్ని తీవ్రంగా కొనసాగిస్తున్నాయి. విప్లవోద్యమ ప్రాంతాల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సాయుధ బలగాలు వేలాది మందిని అరెస్టులు చేసి అక్రమ కేసులు మోపి జైలు పాలు చేస్తున్నాయని లేఖలో అభయ్ ప్రస్తావించారు.

హిందూయిజం పేరుతో బీజేపీ రాజ్యహింస

మొదటిపేజీ తరువాయి..

చంపేస్తున్నది. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం సాల్వాజుడుం మీద దాడులు చేస్తే, బీజేపీ ఆపరేషన్ కగార్ పేరిట మానవ హననాన్ని, నక్సల్స్ ఏరివేత పేరుతో నరహంతకంగా నర మేధాన్ని కొనసాగిస్తున్నది. ఇంత జరుగుతున్నప్పటికీ మిగతా రాజకీయ పార్టీలు కూడా స్పందించడం లేదు. ఇదే పరిస్థితి ఇలాగే కొనసాగితే, భవిష్యత్తులో ప్రశ్నించే గొంతుకలు మిగలవు.

తెలంగాణలో ఎల్ఆర్ఎస్ గడువు పెంపు

మొదటిపేజీ తరువాయి..

25 శాతం రాయితీ ఇవ్వనున్నట్లు ప్రభుత్వం స్పష్టం చేసింది. మరోవైపు ఈ ఎల్ఆర్ఎస్ పక్రియ ద్వారా ఇప్పటికే లే అవుట్లను క్రమబద్ధీకరణ చేసింది. దీని ద్వారా రాష్ట్ర ప్రభుత్వానికి సుమారుగా రూ. 1000 కోట్లకు పైగా ఆదాయం సమకూరినట్లు సమాచారం. అలాగే ఇప్పటి వరకు రాష్ట్రవ్యాప్తంగా వివిధ మున్సిపాలిటీ-ల పరిధిలో ఎల్ఆర్ఎస్ దరఖాస్తులు 15.27 లక్షలు వచ్చాయి. వాటిలో 15,894 దరఖాస్తులను ప్రభుత్వాధి కారులు తిరస్కరించారు. ఇక ప్రాసెస్ అయిన ఎల్ఆర్ఎస్ దరఖాస్తులు 6. 87లక్షలు కాగా.. ఎల్ఆర్ఎస్ ఫీజు రూ. 8.65 లక్షలు పెండింగ్‌లో ఉంది. వీటితో పాటు- ఎల్ఆర్ఎస్ ఫీజు చెల్లించిన దరఖాస్తులు 2.6 లక్షలు కాగా.. వాటికి సంబంధించి ప్రోసీడింగ్ ఇచ్చిన ఎల్ఆర్ఎస్ దరఖాస్తులు 58, 032 ఉన్నాయని అధికార వర్గాలు వెల్లడించాయి. ఇక ఈ ఎల్ఆర్ఎస్ ఫీజు చెల్లింపు గడువును పెంచడం పట్ల ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఎందుకంటే.. ప్రభుత్వం ఎల్ఆర్ఎస్ వివరాలను వెబ్‌సైట్ పోర్టల్‌లో పొందుపరిచింది. అయితే అందులోని ప్రభుత్వ ధరలకు.. బయట మార్కెట్ విలువకు పూర్తి వాస్తవ విరుద్ధంగా ఉంది. అలాగే ఎల్ఆర్ఎస్ కోసం ప్రభుత్వం ఫోన్ నెంబర్‌ను ప్రజలకు అందుబాటు-లోకి తీసుకు వచ్చింది. ఆ నెంబర్ సైతం సక్రమంగా పని చేయడం లేదంటూ ప్రజల నుంచి ప్రభుత్వానికి ఫిర్యాదులు అందాయి.అలాగే వెబ్ సైట్ పోర్టల్‌లోని అంశాలపై ప్రభుత్వం దృష్టికి ప్రజలు తీసుకు వెళ్లేందుకు ప్రయత్నించారు.

ఆర్‌సీబీ జోరుకు బ్రేక్..!

8 వికెట్ల తేడాతో గుజరాత్ టైటాన్స్ గెలుపు

ఐపీఎల్ 2025 సీజన్‌లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు(ఆర్‌సీబీ) జోరుకు బ్రేక్‌పడింది. బుధవారం ఏకపక్షంగా సాగిన మ్యాచ్‌లో సమష్టిగా

రాణించిన గుజరాత్ టైటాన్స్.. 8 వికెట్ల తేడాతో ఆర్‌సీబీని చిత్తు చేసింది. బౌలింగ్‌లో సిరాజ్(3/19).. బ్యాటింగ్‌లో జోస్ బట్లర్.. ఆర్‌సీబీని చెడుగుడు ఆడేసారు. ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన ఆర్‌సీబీ నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్లకు 169 పరుగులు చేసింది. లియామ్ లివింగ్ స్టోన్(40 బంతుల్లో ఫోర్, 5 సిక్స్‌లతో 54) హాఫ్ సెంచరీతో రాణించగా.. జితేష్ శర్మ(21 బంతుల్లో 5 ఫోర్లు, సిక్స్‌తో 33), టీమ్ డేవిడ్(18 బంతుల్లో 3 ఫోర్లు, 2 సిక్స్‌లతో 32) దూకుడుగా ఆడారు. గుజరాత్ టైటాన్స్ బౌలర్లలో మహమ్మద్ సిరాజ్ మూడు వికెట్లు తీయగా.. సాయి కిషోర్(2/22) రెండు వికెట్లు పడగొట్టాడు. అర్షద్ ఖాన్, ఇషాంత్ శర్మ తలో వికెట్ తీసారు. అనంతరం గుజరాత్ టైటాన్స్ 17.2 ఓవర్లలో 2 వికెట్లకు 170 పరుగులు చేసి సునాయస విజయాన్నందుకుంది. జోస్ బట్లర్(39 బంతుల్లో 5 ఫోర్లు, 6 సిక్స్‌లతో 73 నాటౌట్) అజేయ హాఫ్ సెంచరీతో చెలరేగగా.. సాయి సుదర్శన్(36 బంతుల్లో 7 ఫోర్లు, సిక్స్‌తో 49)రాణించాడు. ఆర్‌సీబీ బౌలర్లలో భువనేశ్వర్ కుమార్, జోష్ హజెల్ వుడ్ తలో వికెట్ తీసారు.పవర్ ప్లేలోనే ఆర్‌సీబీ నాలుగు వికెట్లు కోల్పోవడం ఆ జట్టు విజయవకాశాలు దెబ్బతీసింది. సూపర్ ఫామ్‌లో ఉన్న ఫిల్ సాల్ట్‌తో పాటు విరాట్ కోహ్లీ, దేవదత్ పడిక్కల్, రజత్ పటీదార్ పేలవ ప్రదర్శన ఈ మ్యాచ్‌కు టర్నింగ్ పాయింట్‌గా నిలిచింది. ఈ టాప్-4 బ్యాటర్లలో ఒక్కరు క్రీజులో నిలబడినా ఫలితం మరోలా ఉండేది. సంచలన బౌలింగ్ ప్రదర్శనతో ఈ మ్యాచ్‌లో సిరాజ్ మోస్ట్ వాల్యూబుల్ ప్లేయర్‌గా నిలిచిపోయాడు. విధ్వంసకర బ్యాటింగ్‌తో ఆర్‌సీబీ లక్ష్యాన్ని చిన్నది చేసిన జోస్ బట్లర్ అన్‌సంగ్ హీరోగా నిలిచాడు. ఈ స్వల్ప లక్ష్యాన్ని గుజరాత్ టైటాన్స్ ఆడుతూ పాడుతూ చేధించింది. కెప్టెన్ శుభ్‌మన్ గిల్(14) విఫలమైనా.. జోస్ బట్లర్‌తో కలిసి సాయి సుదర్శన్ ఇన్నింగ్స్‌ను ముందుకు నడిపించాడు. ఆరంభంలో కాస్త ఆచితూచి ఆడటంతో పవర్ ప్లేలో గుజరాత్ వికెట్ నష్టానికి 42 పరుగులే చేసింది. అనంతరం కాస్త దూకుడు పెంచిన ఈ జోడీ ఆర్‌సీబీ బౌలర్లపై భారీ షాట్లతో విరుచుకుపడింది. హాఫ్ సెంచరీ ముంగిట సాయి సుదర్శన్‌ను హజెల్ వుడ్.. కీపర్ క్యాచ్‌గా ఔట్ చేయగా.. షెర్ఫెన్ రుథర్‌ఫోర్డ్ సాయంతో జోస్ బట్లర్ చెలరేగాడు. భారీ సిక్సర్లు బాదిన అతను 31 బంతుల్లో హాఫ్ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. మరో ఎండ్‌లో రూథర్‌ఫోర్డ్ సైతం బ్యాట్‌కు పనిచెప్పడంతో ఆర్‌సీబీ బౌలర్లు ఏం చేయలేకపోయాడు. హజెల్ వుడ్ వేసిన 18వ ఓవర్‌లో జోస్ బట్లర్ రెండు భారీ సిక్సర్లు బాది విజయాన్ని ఖాయం చేయగా.. రూథర్‌ఫోర్డ్ సిక్సర్‌తో మ్యాచ్‌ను ముగించాడు.అంతకుముందు టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన ఆర్‌సీబీకి ఆదిలోనే గట్టి షాక్ తగిలింది. పిచ్ నుంచి లభించిన సహకారాన్ని గుజరాత్ టైటాన్స్ బౌలర్లు అందిపుచ్చుకున్నారు. సిరాజ్ వేసిన తొలి ఓవర్‌లోనే ఫిల్ సాల్ట్ ఇచ్చిన సునాయస క్యాచ్‌ను జోస్ బట్లర్ నేలపాలు చేశాడు. కానీ ఆ మరుసటి ఓవర్‌లోనే విరాట్ కోహ్లీని(7) అర్షద్ ఖాన్ క్యాచ్ ఔట్‌గా పెవిలియన్ చేర్చాడు. అనంతరం సిరాజ్ తన వరుస ఓవర్లలో దేవదత్ పడిక్కల్(4)తో పాటు డేంజరస్ ఫిల్ సాల్ట్(14)ను క్లీన్ బౌల్డ్ చేశాడు. రెండు లైఫ్‌లు వచ్చినా ఫిల్ సాల్ట్ సద్వినియోగం చేసుకోలేకపోయాడు. దాంతో 35 పరుగులకే ఆర్‌సీబీ మూడు వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో పడింది. పవర్ ప్లే అనంతరం రజత్ పటీదార్‌ను ఇషాంత్ శర్మ ఎల్బీగా పెవిలియన్ చేర్చాడు. ఈ పరిస్థితుల్లో జితేశ్ శర్మ, లియామ్ లివింగ్ స్టోన్ జట్టును ఆదుకునే ప్రయత్నం చేశారు. జితేశ్ శర్మ భారీ షాట్లతో విరుచుకుపడ్డాడు. 52 పరుగుల భాగస్వామ్యంతో క్రీజులో సెట్ అయిన ఈ జోడీని సాయి కిషోర్ విడదీసాడు. భారీ షాట్ ఆడే ప్రయత్నంలో జితేశ్ శర్మ క్యాచ్ ఔట్‌గా వెనుదిరిగాడు. క్రీజులోకి వచ్చిన కృనాల్ పాండ్యా(5) తీవ్రంగా నిరాశపర్చాడు. సాయికిషోర్‌కు రిటర్న్ క్యాచ్ ఇచ్చి వెనుదిరిగాడు. టీమ్ డేవిడ్‌తో కలిసి లివింగ్ స్టోన్ చెలరేగాడు. ముఖ్యంగా రషీద్ ఖాన్ బౌలింగ్‌లో విరుచుకుపడ్డాడు. అతని బౌలింగ్‌లో లివింగ్ స్టోన్ 5 సిక్సర్లు బాదడం విశేషం. ఈ క్రమంలో అతను 39 బంతుల్లో హాఫ్ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. మరో ఎండ్‌లో టీమ్ డేవిడ్ ఉండటంతో.. ఆర్‌సీబీ 190 పరుగులు చేస్తుందని అంతా అనుకున్నారు. కానీ 19వ ఓవర్ వేసిన సిరాజ్.. లివింగ్ స్టోన్‌ను కీపర్ క్యాచ్‌గా

పెవిలియన్ చేర్చాడు. దాంతో ఆ ఓవర్‌లో 4 పరుగులు మాత్రమే వచ్చాయి. ప్రసిధ్ కృష్ణ వేసిన ఆఖరి ఓవర్‌లో టీమ్ డేవిడ్.. వరుసగా 4, 6, 4 బాది ఆఖరి బంతికి ఔటయ్యాడు. ఈ ఓవర్‌లో 16 పరుగులే రావడంతో ఆర్‌సీబీ 169 పరుగులే చేయగలిగింది.

సద్దుమణిగిన వివాదం

హెచ్‌సీఏ, సన్‌రైజర్స్ వివాదం ఎట్టకేలకు పరిష్కారం

హైదరాబాద్ ఉప్పల్ స్టేడియంలో కాంప్లిమెంటరీ టికెట్ల విషయంలో సన్‌రైజర్స్ హైదరాబాద్ వర్సెస్ హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ మధ్య చెలరేగిన వివాదం ఎట్టకేలకు క్లియర్ అయింది. ఇరువర్గాల ప్రతినిధుల మధ్య భేటీలో సమస్య పరిష్కారమైంది. అసలేం జరిగిందంటేహైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ హెచ్‌సీఏ వర్సెస్ సన్‌రైజర్స్ హైదరాబాద్ మధ్య చెలరేగిన టికెట్ల వివాదం ఎట్టకేలకు పరిష్కారమైంది. కాంప్లిమెంటరీ టికెట్ల విషయంలో హెచ్‌సీఏ బెదిరిస్తోందని..ఇలా చేస్తే హైదరాబాద్ వదిలి వెళ్లిపోతామని ఎస్ఆర్‌హెచ్ యాజమాన్యం స్పష్టం చేసింది. ఇదే అదనుగా ఎస్ఆర్‌హెచ్ జట్టును ఏపీ ప్రభుత్వం ఆహ్వానించింది. చిలికి చిలికి గాలివానలా మారిన ఈ వివాదానికి ఇప్పుడు శుభం కార్డు పడింది. ఇవాళ హెచ్‌సీఏ, ఎస్ఆర్‌హెచ్, బీసీసీఐ ప్రతినిధులు భేటీ అయ్యారు. ముగ్గురి మధ్య జరిగి త్రై పాక్షిక ఒప్పందం మేరకు నడుచుకునేందుకు అటు ఎస్ఆర్‌హెచ్ ఇటు హెచ్‌సీఏ ప్రతినిధులు అంగీకరించారు. దాంతో ఇకపై ఉప్పల్ స్టేడియంలో జరిగే మ్యాచ్‌లకు ఎలాంటి ఆటంకం ఉండదు. హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ సెక్రటరీ ఆర్ దేవరాజ్ నేతృత్వంలో చర్చలు జరగగా ఎస్ఆర్‌హెచ్ ప్రతినిధులు కిరణ్, శరవణన్, రోహిత్‌లు ఒప్పందాన్ని ఖరారు చేశారు. ఈ త్రై పాక్షిక ఒప్పందం ప్రకారం స్టేడియంలోని అన్ని కేటగిరీల్లో 10 శాతం టికెట్లు ఇచ్చేందుకు అంగీకారం కుదిరింది. చాలా కాలంగా ఆచరిస్తూ వస్తున్నట్టే ప్రతి కేటగరీలో పాస్ విధానం కొనసాగించాలని హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ప్రతిపాదించింది. ఎస్ఆర్‌హెచ్ సీఈవో షణ్ముగంతో ఫోన్ సంప్రదింపుల తరువాత 3900 కేటగరీ కాంప్లిమెంటరీ పాస్

విధానంలో ఎలాంటి మార్పులు ఉండవని తేలింది. ఎస్ఆర్‌హెచ్‌తో ప్రొఫెషనల్‌గా పూర్తిగా సహకారం అందించేందుకు హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ అంగీకారం తెలిపింది. గతంలో నెలకున్న వివాదాలు ఇక ముగిసినట్టేనని హెచ్‌సీఏ, ఎస్ఆర్‌హెచ్ సంయుక్తంగా ప్రకటించాయి.

అనికేత్ వర్మకు హార్దిక్ స్ఫూర్తి

2025 ఐపీఎల్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టు నుంచి యంగ్ ప్లేయర్ అనికేత్ వర్మ వెలుగులోకి వచ్చాడు. ఈ 23ఏళ్ల కుర్రాడు అదిరే ఆటతో ప్రేక్షకులను ఆకట్టుకుంటున్నాడు. రీసెంట్‌గా ఢిల్లీ క్యాపిటల్స్‌పై అనికేత్ 41బంతుల్లోనే 74 పరుగులు చేసి ఔరా అనిపించాడు. అంతకుముందు లఖ్‌నవూపై 276 స్ట్రైక్‌రేట్‌తో విరుచుకుపడ్డాడు. దీంతో ఒక్కసారిగా అనికేత్‌కు ఫుల్ క్రేజ్ వచ్చింది. అయితే స్టార్ ప్లేయర్ హార్దిక్ పాండ్య అతడికి స్ఫూర్తిగా నిలిచాడని అనికేత్ అంకుల్ అమిత్ వర్మ వెల్లడించారు. తాను నాలుగేళ్లపాటు మ్యాగీ న్యూడిల్స్ తినే క్రికెట్ ప్రాక్టీస్‌కు వెళ్లినట్లు హార్దిక్ గతంలో పలు ఇంటర్వ్యూల్లో చెప్పాడు. ఇంటర్వ్యూల్లో హార్దిక్ మాటలు విన్న అనికేత్ కెరీర్‌ను సీరియస్‌గా తీసుకొని ప్రిపేర్ అయినట్లు అమిత్ పేర్కొన్నారు.'అనికేత్‌కు 14ఏళ్లు ఉన్నప్పుడు, ఈ న్యూస్ పేపర్‌లో ఓ వార్త చదివాను. ఓరోజు అకాడమీకి వెళ్తున్నప్పుడు అదే స్టోరీని అనికేత్‌కు చెప్పా. అప్పుడే అనికేత్‌లో ఆట పట్ల ప్యాషన్, పరుగుల దాహాన్ని నేను గమనించాను. కీలక ఆటగాడిగా మారతాడని అప్పుడే భావించా. ఒకసారి స్టేడియం చేరుకున్నాక, నా పాదాలను తాకిన అనికేత్ 'కొన్ని విషయాలు మీ దృష్టికి తీసుకొస్తున్నా' అని చెప్పాడు. అప్పుడు నేను నవ్వాను. కానీ, అతడు మాత్రం సీరియస్‌గా తీసుకున్నాడు. హార్దిక్ పాండ్య ఐపీఎల్‌లోకి డెబ్యూ చేసిన తర్వాత జాతీయ జట్టులోకి వచ్చాడు. అలాగే ఏదొక రోజు అనికేత్ కూడా ఆ స్థాయికి చేరతాడని అనుకుంటున్నాను' అని అమిత్ వెల్లడించారు. కాగా, ఉత్తర్‌ప్రదేశ్ ఝాన్సీకి చెందిన అనికేత్ మధ్యప్రదేశ్ తరఫున దేశవాళీ క్రికెట్ ఆడాడు. ఐపీఎల్‌లోకి రాకముందు సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీ ఆడాడు. మధ్యప్రదేశ్ ప్రీమియర్ లీగ్- %వీర్రాలా% 200పైగా స్ట్రైక్‌రేట్‌తో బ్యాటింగ్ చేసి అనికేత్ ఔరా అనిపించాడు. భోపాల్ లెపార్డ్స్ తరఫున ప్రాతినిధ్యం వహించిన ఈ కుర్రాడు 32 బంతుల్లోనే సెంచరీ బాదేశాడు. ఇలా వెలుగులోకి వచ్చిన అనికేత్‌ను సన్‌రైజర్స్ గతేడాది జరిగిన మెగా వేలంలో రూ.30లక్షల బేస్ ప్రైస్‌కు కొనుగోలు చేసింది.



రెండో సినిమా ప్రకటించిన నీహారిక

మెగా బ్రదర్ నాగబాబు ముద్దుల తనయ నిహారిక యాంకర్‌గా, హీరోయిన్‌గా,నిర్మాతగా టాలీవుడ్ ఇండస్ట్రీలో సత్తా చాటుతుంది. హీరోయిన్‌గా నిహారిక చేసిన సినిమా ఒక్కటి హిట్ కాలేదు. దాంతో నిర్మాత అవతారం ఎత్తింది. నిహారిక నిర్మించిన కమిటీ కుర్రోళ్లు సినిమా సంచలన విజయం సాధించింది. ముందుగా హీరోయిన్ గా, తర్వాత వెబ్ సిరీస్ ల్లో నటించిందికానీ చివరకు నిర్మాతగా స్థిరపడింది. నిహారిక ఇటీవలే చిరంజీవి విశ్వంభర చిత్రంలోని ఓ పాటలో షూటింగ్ లో పాల్గొంది. ఈ పాటలో సాయిధరమ్ తేజ్ కూడా పాల్గొన్నారు. నటిగా మంచి మార్కులు దక్కించుకోలేకపోయిన నిహారిక నిర్మాతగా సత్తా చాటుతుంది. కొత్త డైరెక్టర్, కొత్త నటీనటులతో చిన్న సినిమాగా వచ్చిన కమిటీ- కుర్రోళ్లు చిత్రం 50 కోట్ల వసూళ్లు సాధించి అందరి దృష్టిని ఆకర్షించింది.. ఇప్పుడు నిహారిక నిర్మాతగా రెండో సినిమాతో పలకరించబోతుంది. తన రెండు సినిమాని అధికారికంగా ప్రకటించింది. ఈ సినిమాలో ఫుల్ ఫామ్ లో ఉన్న నటుడు సంగీత్ శోభన్ హీరోగా నటించబోతున్నాడు. మ్యాడ్, మ్యాడ్ స్క్వేర్ సినిమాలతో పాటు- ఒక చిన్న ఫ్యామిలీ స్టోరీ, 3 రోజెస్.. పలు సిరీస్ లతో ఫుల్ ఫేమ్ తెచ్చుకున్న సంగీత్ ఇందులో మెయిన్ లీడ్ పోషించబోతున్నాడు. సంగీత్ సోలో హీరోగా నటించనున్న తొలి సినిమా ఇదే. ఈ సినిమాకు మానస శర్మ దర్శకత్వం వహిస్తున్నారు. అయితే ఈ ఇద్దరు గతంలో నిహారికతో కలిసి పని చేశారు. నిహారిక రూపొందించిన వెబ్ ప్రాజెక్ట్స్‌లో హీరో సంగీత్ శోభన్, డైరెక్టర్ మానస శర్మ భాగం అయ్యారు. జీ5తో పింక్ ఎలిఫెంట్ పిక్చర్స్ రూపొందించిన వెబ్ సిరీస్ 'ఒక చిన్న ఫ్యామిలీ స్టోరీ'కి మానస శర్మ రచయితగా పని చేశారు. 'ఒక చిన్న ఫ్యామిలీ స్టోరీ'లో సంగత్ శోభన్ ప్రధాన పాత్ర పోషించారు. ఇక సోనీ లివ్ రూపొందించిన 'బెంచ్ లైఫ్'కి మానస శర్మ దర్శకురాలిగా పని చేశారు. గతంలో ఈ ముగ్గురు కలిసి అద్భుతాలు చేయగా, ఇప్పుడు ఫీచర్ ఫిల్మ్ సరికొత్త హిస్టరీ క్రియేట్ చేసేందుకు రెడీ అయ్యారు. ఈ ప్రాజెక్ట్‌కి మానస శర్మ కథను అందించగా మహేష్ ఉప్పల కో రైటర్‌గా స్క్రీన్ ప్లే, డైలాగ్స్ అందించారు. మన్యం రమేష్ ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్‌గా వ్యవహరిస్తున్నారు

చిరంజీవితో నాని సినిమా

అంచనాలను పెంచిన ప్రకటన

నేచురల్ స్టార్ నాని ఇప్పుడు హీరోగా కన్నా నిర్మాతగానే అందరి దృష్టిని ఆకర్షిస్తున్నాడు. కారణం ఆయన చేసే ప్రతి సినిమా కూడా సూపర్ హిట్ అవుతుంది. రీసెంట్‌గా కోర్ట్ అనే సినిమాతో పెద్ద విజయం సాధించారు. ఈ క్రమంలో నాని అంటే మంచి సినిమాలు చేస్తాడని ఫ్యాన్స్ తో పాటు ప్రేక్షకులు, కూడా ఫిక్స్ అయ్యారు. ప్రస్తుతం నాని శైలేష్ కొలను దర్శకత్వంలో సొంత బ్యానర్ లో హిట్3 సినిమా చేస్తున్నాడు. అలానే ది ప్యారడైజ్ అనే చిత్రంలోను నటిస్తున్నాడు. అయితే రీసెంట్ గా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న నాని తన ఫ్యూచర్ ప్రాజెక్టుల గురించి కొన్ని ఆసక్తికర విషయాలను వెల్లడించాడు. త్వరలో దసరా డైరెక్టర్ శ్రీకాంత్ ఓదెలతో చిరంజీవి ఓ ప్రాజెక్ట్ చేయనుండగా, దీనికి నాని సహ నిర్మాతగా వ్యవహరించనున్నారు. ఈ ప్రాజెక్ట్‌పై అంచనాలు బాగా ఉన్నాయి. అందుకు కారణం ఈసారి మళ్లీ రక్తం పారాల్సిందే అంటూ శ్రీకాంత్ చాలా వయెలెంట్ సినిమా చేస్తున్నట్లు ఇప్పటికే ప్రకటించారు. దీని గురించి తాజా ఇంటర్వ్యూలో నాని మాట్లాడుతూ.. చిరంజీవి గారు అనగానే డ్యాన్స్, యాక్షన్ అని మనం ఒక అభిప్రాయానికి వచ్చేశాం..కానీ ఆయన అంతుకుమించి.. చిరంజీవి కేవలం అది మాత్రమే కాదు.. ఆయన్ని ప్రతి ఫ్యామిలీలో ఒక మెంబర్‌గా భావిస్తాం.. కానీ ఆ విషయాన్ని మనం మర్చిపోయి వేరే దేనిపైన ఫోకస్ చేస్తున్నాం. ఇప్పుడు శ్రీకాంత్ మ్యాడ్‌నెస్‌ని చిరంజీవి గారి సినిమా అంటే అది చాలా సూపర్ కాంబో.. అసలు నా లైఫ్‌లో చిరంజీవి గారి లాంటి స్థాయి వ్యక్తిని పెట్టి నేను ఓ సినిమా తీస్తానని ఎప్పుడూ ఊహించలేదు..

కానీ అనుకోకుండా ఇది కుదిరింది.. ఇది గొప్ప బాధ్యతగా భావిస్తున్నా.. ఖచ్చితంగా ది బెస్ట్ ఇస్తాం అంటూ నాని కామెంట్స్ చేశారు. ప్రస్తుతం నాని చేసిన కామెంట్స్‌తో మూవీపై అంచనాలు అమాంతం పెరిగాయి. నాని, చిరంజీవికి ఈ ప్రాజెక్ట్ మెమోరబుల్‌గా ఉండడం ఖాయమని అంటున్నారు.. ఈ వచ్చే ఏడాది ఈ సినిమా షూటింగ్ ప్రారంభమవుతుందని తెలిపారు.

ఆలియా భట్‌తో పోల్చకండి ప్లీజ్..

బాలీవుడ్ నటి అలియాభట్‌తో తనని పోల్చి చూడటంపై తనకు ఏమాత్రం నచ్చలేదని నటి షాలినీ పాండే అన్నారు. తనని తనలా గుర్తిస్తే చాలని ఓఇంటర్వ్యూలో చెప్పారు. ప్రేక్షకులు నన్నెంతగానో ప్రేమిస్తున్నారు. వారి ప్రేమాభిమానాలు వెలకట్టలేనివి. కొంతమంది నన్ను నటి అలియాభట్‌తో పోలుస్తూ తమ ప్రేమను తెలియజేస్తున్నారు. మనకు ఇండస్ట్రీలో ఇప్పటికే ఒక అలియా ఉన్నారు. కాబట్టి, ఆమెలా మరొకరు అవసరం లేదు. ఆమెలా ఉండాలని వేరొకరు అనుకోరు. ఎందుకంటే, ఆమె అద్భుతమైన నటి. సినిమాల్లోనే కాదు. నిజ జీవితంలోనూ ఆమె ఎంతో ఉన్నతంగా ఉంటారు. నేను కూడా ఆమె నుంచి ఎంతో స్ఫూర్తి పొందుతుంటానని అన్నారు. నాకంటూ ఒక గుర్తింపు తెచ్చుకోవాలనేది నా ఉద్దేశం అని షాలినీ పాండే తెలిపారు. 2017లో విడుదలైన 'అర్జున్ రెడ్డి'తో ఆమె హీరోయిన్‌గా ఎంట్రీ ఇచ్చారు. తొలి చిత్రంతోనే గుర్తింపు తెచ్చుకున్నారు. ప్రస్తుతం ఆమె బాలీవుడ్‌లో సినిమాలు, సిరీస్‌లు చేస్తున్నారు. షాలినీ పాండే ఇటీవల నటించిన వెబ్‌సిరీస్ 'డబ్బా కార్టెల్'. షబానా అజ్మీ, జ్యోతిక కీలక పాత్రల్లో నటించారు. నెట్‌ఫ్లిక్స్ వేదికగా స్ట్రీమింగ్ అవుతోంది.

అద్భుత చిత్రరాజం ఆదిత్య 369

అప్పట్లో ఆదిత్య-369 అద్భుత విజయం సాధించింది. అంతేకాదు మంచి సినిమాగా నిలిచింది.దర్శకుడు సింగీతం ఖాతాలో హిట్ పడింది. ఆయన ప్రతిభన్ మరోమరాఉ చాటింది. ఈ సినిమా గురించి ... ఇదేం నేపథ్యంఅని అప్పట్లో చాలామంది సందేహించారు. సినిమా విడుదలై, ప్రేక్షకులను కొత్త ప్రపంచంలోకి తీసుకెళ్లడం చూసి ఆశ్చర్యపోయారు. దాదాపు 34 ఏళ్ల క్రితం తెరకెక్కిన ఈ సినిమా అధునాతన సాంకేతిక విలువలతో ఈ నెల 4న రీ రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా దర్శకుడు సింగీతం శ్రీనివాసరావు నాటి విశేషాలు పంచుకున్నారు. హాలీవుడ్ మూవీ 'బ్యాక్ టు- ది ఫ్యూచర్' స్ఫూర్తితో 'ఆదిత్య 369' తీశానని అనడాన్ని తిప్పికొట్టారు. ది టైమ్ మిషన్' నవలను తాను కాలేజీ రోజుల్లోనే చదివానని, అందులోని ఆసక్తికర అంశాల గురించి స్నేహితులతో చర్చించేవాడిని. డైరెక్టర్‌ని అయిన తర్వాత ఆ కాన్సెప్టుతో సినిమా చేస్తే బాగుంటుందనిపించింది. ఓ సారి



విమాన ప్రయాణం చేస్తుండగా ఎస్పీ బాలసుబ్రహ్మణ్యంతో నా ఆలోచన చెప్పా. ఎంతో ఉత్సాహం చూపిన ఆయన 'ఐడియా బాగుంది. తప్పకుండా చేద్దాం' అని అన్నారు. ఇద్దరు ముగ్గురు ప్రముఖ నిర్మాతలకు ఆయనే ఈ కథ వినిపించారు. కానీ, వారికి సైన్స్ ఫిక్షన్ కాన్సెప్టు అర్థం కాలేదు. ఇదేదో ఫాంటసీ సినిమా అనుకున్నారు. కథపై నమ్మకం ఉన్న ఎస్పీబీ పట్టు వదలకుండా.. నిర్మాత శివలెంక కృష్ణప్రసాద్‌ను సంప్రదించారు. ఆయనకు బాగా నచ్చడంతో సినిమా పట్టాలెక్కింది. హీరో పాత్రకు ముందు నుంచీ బాలకృష్ణనే అనుకున్నాం. స్టోరీ విన్న వెంటనే ఆయన నటించేందుకు అంగీకరించారు. హీరోయిన్‌గా విజయశాంతి బాగుంటుందని కృష్ణప్రసాద్, బాలకృష్ణ అనుకున్నారు. డేట్స్ సర్దుబాటుకాకపోవడంతో ఆమె నటించలేకపోయారు. ఓ దర్శకుడు మోహిని గురించి చెప్పగా.. ఆడిషన్ చేసి కథానాయికగా ఆమెను ఎంపిక చేశాం. బాలీవుడ్ నటుడు టీనూఆనంద్‌ను ప్రొఫెసర్ పాత్రకు తీసుకున్నామని అన్నారు.

Printed, Published & Owned by Margam Rama on behalf of ADUGU DIGITAL MEDIA Pvt. Ltd, Printed and Published at ADUGU PRESS, H No: 7-120, PALAKURTHI Village & Mandal, Jangaon District, Telangana, PIN: 506146.
Chief Editor: Dr.Margam Lakshmi Narayana, Ph.No. : 8499990005